www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 08.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 166
పేజీలు: 12 వెల: రూ. 5

## పీసీసీ చీఫ్‌గా పొన్నం?!

బీసీ కోటాలో అనూహ్య మార్పులు..


- తెలంగాణ కాంగ్రెస్‌లో 'పదవుల' ప్రక్షాళన!
- రేసులో మహేష్ గౌడ్, పొన్నం ప్రభాకర్!
- మహేష్‌కు డిప్యూటీ సీఎం?
- పొన్నంకు పీసీసీ పగ్గాలు?
- అధిష్ఠానం కొత్త వ్యూహం!

03




బీసీ అస్త్రంతో తెలంగాణలో పట్టు బిగించాలని చూస్తున్న కాంగ్రెస్‌లో పదవుల పంపకం ఆసక్తికర మలుపు తిరిగింది. ఇటు సర్కారులోనూ, అటు పార్టీలోనూ సమతుల్యత సాధించే క్రమంలో.. పొన్నం, మహేష్ గౌడ్ స్థానాలను పరస్పరం మార్చే దిశగా అధిష్ఠానం అడుగులు వేస్తోంది. అధికారమే లక్ష్యంగా సాగుతున్న ఈ రాజకీయ చదరంగంలో ఎవరికి 'పీఠం' దక్కుతుంది, ఎవరికి 'పార్టీ' బాధ్యత అందుతుందన్న చర్చ ఇప్పుడు గాంధీ భవన్ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది.

-ముద్ర, కరీంనగర్:




# కవితకు కేసీఆర్ ఆయుధం?

## టీఆర్ఎస్ పేరుతో కొత్త రాజకీయ సంచలనం సృష్టించాలనే కూతురి ప్లాన్

- బీఆర్ఎస్‌కు ఎమోషనల్ షాక్ ఇవ్వబోతున్న వ్యూహం
- కేసీఆర్ వదిలిన పేరే ఇప్పుడు కవితకు రాజకీయ ఆయుధం
- తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిలించాలనే కవిత యత్నం
- పాత ఉద్యమపార్టీ పేరు.. కొత్త రాజకీయ అజెండాతో కవిత ఎంట్రీ
- బీఆర్ఎస్‌లో అసంతృప్తి నేతలకు కవిత కొత్త ఆశా కిరణమా?
- 'బిహార్ సిద్ధాంతాలకు నో'.. తెలంగాణ ఐడెంటిటీకి కవిత ప్రాధాన్యం
- గులాబీ దళంలో కలకలం.. కవిత పార్టీపై వేడెక్కిన చర్చలు
- టీఆర్ఎస్ పేరుతో క్యాడర్‌ను ఆకర్షించాలనే కవిత వ్యూహం
- కుటుంబ రాజకీయాల్లో కొత్త మలుపు.. తండ్రి అస్త్రంతో తనయ పోరు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్ర రాజకీయాల్లో మరో భారీ కుదుపునకు రంగం సిద్ధమవుతోంది. కొత్త పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకున్న కవిత.. తన పార్టీకి టీఆర్ఎస్ అనే ఎమోషనల్ సెంటిమెంట్ కలిసిన పేరును పార్టీకి ఖరారు చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే బీఆర్ఎస్ పార్టీకి పెను సమస్య కావొచ్చు.
తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చడం అనేది కేసీఆర్ చేసిన అతి పెద్ద రాజకీయ తప్పిదమని ఇప్పుడు సొంత పార్టీ నేతలే బహిరంగంగా అంగీకరిస్తున్నారు. జాతీయ రాజకీయాల మోజులో తెలంగాణ అనే అస్తిత్వాన్ని వదులుకోవడం వల్ల ప్రజలతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ చెబుతోంది. ఎన్నికల ఓటమి తర్వాత మళ్లీ పాత పేరుకు మారదామని కేటీఆర్ సహా ఇతర నేతలు భావించినా, సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాదని కేసీఆర్ తేల్చేశారు. సరిగ్గా ఈ ఖాళీనే కవిత తన రాజకీయ ఎదుగుదలకు అనువుగా మలచుకుంటున్నారు.
వ్యూహాత్మక అడుగు – ఎమోషనల్ డ్యామేజ్
ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ వద్ద టీఆర్ఎస్ పేరు ఫ్రీగా ఉందని, దానిని ఎవరైనా వాడుకోవచ్చని కవిత తాజాగా చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ నాయకత్వానికి పెద్ద షాక్. ఒకవేళ కవిత నిజంగానే తన కొత్త పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెడితే, అది బీఆర్ఎస్ పార్టీకి ఊహించని ఎమోషనల్ డ్యామేజ్ కలిగిస్తుంది. రెండు దశాబ్దాల పాటు తెలంగాణ వాదం వినిపించిన ఆ పేరు పట్ల క్యాడర్‌లో ఇప్పటికీ విపరీతమైన ఆదరణ ఉంది. ఇప్పుడు అదే పేరుతో కవిత ముందుకు వస్తే, బీఆర్ఎస్ వైపు ఉన్న అసంతృప్త నేతలు, పాత ఉద్యమకారులు ఆమె వైపు మొగ్గు చూపే అవకాశం పుష్కలంగా ఉంది.

**సిద్ధాంతాల పోరు - తెలంగాణ వర్సెస్ బిహార్**

కవిత తన చిట్ చాట్‌లో మరో కీలక విమర్శ చేశారు. తమ పార్టీలో బిహార్ సిద్ధాంతకర్తలు ఉండరని, కేవలం ఆచార్య జయశంకర్ గారి తెలంగాణ సిద్ధాంతాలే ఉంటాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన పొలిటికల్ స్ట్రాటజిస్టుల పెత్తనాన్ని ఎండగడుతూ, తాను మళ్లీ స్వచ్ఛమైన తెలంగాణ ఉద్యమ కాలపు పార్టీని మిగతా 02లో

గత యూడీఎఫ్ ప్రభుత్వాల పనితీరుతోనే

## విజయాలు

- బంగారం స్మగ్లింగ్ కేసు ఎందుకు అపరిష్కృతంగా మిగిలింది?
- శబరిమల ఆలయం నుంచి తరలించిన బంగారం లెక్కలు ఎందుకు చెప్పలేదు
- కేరళ ముఖ్యమంత్రి విజయన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యుత్తరం

02



అభివృద్ధిలో కేరళ

## అగ్రస్థానం


- అభివృద్ధిలో కేరళ అగ్రస్థానం
- దశాబ్దాల కేరళ విజయాలు ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాల కృషి
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు కేరళ అడుగులు
- కేరళలో అతితక్కువ అవినీతి
- 6వ అత్యంత అవినీతిమయ రాష్ట్రంగా తెలంగాణ
- సీఎం రేవంత్ రెడ్డికి కేరళ సీఎం పినరయి విజయన్ లేఖ

02

అడవిలో ఆపరేషన్

## వికాసం!

కర్రెగుట్టలపై ఖాకీ నిఘా




- తెలంగాణ సర్కార్ పెద్ద స్కెచ్..
- ఆపరేషన్ కగార్ సక్సెస్.. ఇప్పుడు అభివృద్ధి మార్గం
- కర్రెగుట్టల్లో అడుగుపెడుతున్న డీజీపీ శివధర్ రెడ్డి
- మావోల కోటలో మౌలిక సదుపాయాల జాతర
- అడవి బిడ్డల చెంతకు రోడ్లు, సోలార్ వెలుగులు
- తీవ్రవాదానికి శాశ్వతంగా చెక్
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీస్ బేస్ క్యాంపు!

10



శ్రీవారి హుండీలో

## రూ.400 కోట్ల రద్దయిన నోట్లు

- కానుకలుగా రూ.500, 1000 నోట్లు
- హుండీల లెక్కింపులో వెలుగులోకి
- మార్చేందుకు అవకాశమివ్వాలన్న టీటీడీ
- కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐకి వినతి

09

అక్రమ సొమ్ముతో బీఆర్ఎస్

200 యూట్యూబ్ చానెళ్లు

## కొనుగోలు

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- ఆ ఛానెళ్లలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసత్య ప్రచారం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం

03



ఫ్యూచర్ సిటీ దారి

## వివాదం

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణపై హైకోర్టు సీరియస్

- సర్కార్‌కు కౌంటర్ ఆదేశాలు
- నిబంధనలు ఉల్లంఘించారంటూ పిటిషన్
- పరిహారం లేకుండా భూములు స్వాధీనం చేయొద్దని హామీ
- 554 ఎకరాల సేకరణపై కోర్టు ప్రశ్నలు
- ఫ్యూచర్ సిటీ రహదారి ప్రాజెక్ట్‌కు అడ్డంకులు
- పరిహారం వరకు భూముల స్వాధీనం లేదు

09



## లేడీస్ స్పెషల్


ఇందిరా మహిళా శక్తి పథకంలో ముందడుగు

మహిళా సంఘాలకు 40 పెట్రోల్ బంకులు

ప్రాంతాలను గుర్తించిన అధికారులు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకులు లాభాలు గడిస్తుండడంతో.. మరిన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ యోచిస్తోంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన 2 పెట్రోల్ బంకులకు భారీగా ఆదాయం వస్తుండటంతో.. రాష్ట్ర వ్యాప్తంగా మరో 40 ఏర్పాటు చేసేందుకు కసరత్తులు మొదలుపెట్టింది. ఈ పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసేందుకు స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగా.. త్వరలోనే నిర్మాణాలు చేపట్టనున్నారు. తెలంగాణలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మిగతా 02లో



## పాకిస్తాన్‌లో లాక్ డౌన్

ఇంధన కొరతతో కుదేలైన దేశం

- ముదురుతోన్న ఆర్థిక సంక్షోభం
- విద్యుత్, ఇంధన వినియోగంపై నియంత్రణలు
- కరోనా రోజులను తలపించే పరిస్థితి..
- పాకిస్థాన్‌లో కఠిన ఆంక్షలు

09

భారత ఆర్మీ చేతికి 10 కోట్ల

## ఆత్మాహుతి డ్రోన్లు


60 రోజుల్లోనే రూ.10 కోట్ల కమికాజీ డ్రోన్ల సరఫరా

- వేగం, సామర్థ్యంతో సైన్యానికి అండ
- 2027 నాటికి రూ.5 వేల కోట్ల మార్కెటే లక్ష్యం
- భారత డ్రోన్ రంగంలో కొత్త యుగం
- జీపీఎస్ జామింగ్‌కైనా లొంగని డ్రోన్లు
- 90%దేశీయ భాగాలతో తయారీ
- ఉత్తర సరిహద్దుల్లో కొత్త శక్తి

09



వర్షంతో ఐపీఎల్ లో వరుసగా రెండు రోజులు మ్యాచ్ కు అంతరాయం.. నిన్న సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్-పంజాబ్ కింగ్స్ పోరు వర్షం కారణంగా రద్దయింది. నేడు రాజస్థాన్ వర్సెస్ ముంబై ఆటకు అంతరాయం కలిగింది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 08.04.2026
www.mudranews.in | @mudranews



**దోసకాయ**



శరీరానికి తేమను అందించి, వేడి ప్రభావాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియకు కూడా చాలా మంచిది.



# డ్రంకన్ డ్రైవ్ కేసులో క్రికెటర్ అరెస్ట్

**ముద్ర డెస్క్ :**
ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకరైన డేవిడ్ వార్నర్ తాజాగా ఒక వివాదంలో చిక్కుకున్నారు. సిడ్నీలో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. మైదానంలో తన దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను వణికించే వార్నర్, ఇప్పుడు చట్టపరమైన చిక్కుల్లో పడటం అభిమానులను విస్మయానికి గురిచేస్తోంది.

అసలేం జరిగింది?
మంగళవారం రాత్రి సిడ్నీ నగర శివార్లలో పోలీసులు సాధారణ ట్రాఫిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్లపై భద్రతను పర్యవేక్షించే క్రమంలో భాగంగా వాహనదారులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేస్తున్నారు. ఈ సమయంలో వార్నర్ ప్రయాణిస్తున్న లగ్జరీ వాహనం పోలీసుల తనిఖీ కేంద్రాన్ని సమీపించింది. అయితే పోలీసులు తనిఖీలు చేస్తున్నారని ముందుగానే గమనించిన వార్నర్ తన వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పార్క్ చేయడానికి ప్రయత్నించాడు. వార్నర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే అతడి వద్దకు వెళ్లి విచారించారు. అనంతరం నిర్వహించిన ప్రాథమిక బ్రీత్ అనలైజర్ పరీక్షలో వార్నర్ రక్తంలో ఆల్కహాల్ శాతం చట్టబద్ధమైన పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసులు నిబంధనల ప్రకారం అతడిని తక్షణమే అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కేసు నమోదు.. బెయిల్
పోలీస్ స్టేషన్‌లో వార్నర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కొన్ని గంటల తర్వాత అతడిని వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్‌పై విడుదల చేశారు. అయితే ఈ కేసుకు సంబంధించి వచ్చే నెలలో స్థానిక కోర్టు ఎదుట విచారణకు హాజరుకావాలని పోలీసులు అతడికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. "చట్టం ముందు ఎవరైనా సమానమే. సెలబ్రిటీ హోదా ఉన్నప్పటికీ ప్రజా భద్రత విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు" అని సిడ్నీ ట్రాఫిక్ విభాగం అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు.

పీఎస్ఎల్ షెడ్యూల్‌పై నీలినీడలు
ప్రస్తుతం డేవిడ్ వార్నర్ పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్.ఎల్)లో కరాచీ కింగ్స్ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. లీగ్ మధ్యలో వ్యక్తిగత కారణాల రీత్యా కొద్దిరోజులు విరామం తీసుకుని ఆస్ట్రేలియాకు చేరుకున్నాడు. షెడ్యూల్ ప్రకారం వచ్చే రెండు రోజుల్లోనే ఆయన తిరిగి పాకిస్థాన్‌కు బయలుదేరాల్సి ఉంది. కానీ తాజా అరెస్ట్ ఘటన, కోర్టు నోటీసుల నేపథ్యంలో ఆయన ప్రయాణంపై సందిగ్ధత నెలకొంది.
ఒకవేళ ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు లేదా కరాచీ కింగ్స్ యాజమాన్యం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే, వార్నర్ ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే పాకిస్థాన్ మీడియాలో ఈ వార్త దావానలంలా వ్యాపించింది.
అభిమానుల నిరాశ.. సామాజిక మాధ్యమాల్లో చర్చవార్నర్ అరెస్ట్ వార్త సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. "వార్నర్ మాకు రోల్ మోడల్, ఇలాంటి తప్పు చేస్తాడని ఊహించలేదు" అంటూ పలువురు నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దానంలో స్లెడ్జింగ్ వివాదాల నుండి బయటపడి కెరీర్ చివరలో హుందాగా కనిపిస్తున్న వార్నర్, మళ్లీ ఇలాంటి వివాదంలో చిక్కుకోవడం అతడి ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.
క్రికెట్ ఆస్ట్రేలియా (CA) ఈ ఘటనపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. ప్రాథమిక విచారణ నివేదిక అందిన తర్వాత బోర్డు స్పందించే అవకాశం ఉంది. గతంలో 'శాండ్‌పేపర్ గేట్' వివాదంతో తన కెరీర్‌లోనే అతిపెద్ద ఎదురుదెబ్బ తిన్న వార్నర్, ఇప్పుడు ఈ కొత్త చట్టపరమైన సమస్య నుండి ఎలా గట్టెక్కుతారో వేచి చూడాలి. పోలీసుల తదుపరి దర్యాప్తులో మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### గత యూడీఎఫ్ ప్రభుత్వాల

# పనితీరుతోనే కేరళ విజయాలు

**ముద్ర, హైదరాబాద్:**
కేరళ అభివృద్ధి గత యూడీఎఫ్ ప్రభుత్వాల పనితీరు ఫలితమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేరళ సీఎం పినరాయి విజయన్‌కు రాసిన లేఖలో, ఎల్డీఎఫ్ పాలనలో జరిగిన పనులను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీతి ఆయోగ్ ఎస్డీజీ సూచికలను తప్పుగా చూపిస్తున్నారని విమర్శించిన రేవంత్, తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును గత ప్రభుత్వాలతో కలపడం సరికాదన్నారు. తాజా గణాంకాల ప్రకారం తెలంగాణ ఆర్థికంగా వేగంగా ఎదుగుతోందని, జాతీయ సగటు ను మించి వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. కేరళలో పేదరిక నిర్మూలనపై విజయన్ చేసిన ప్రకటనలను ప్రశ్నించిన రేవంత్, ఇంకా వేల కు టుంబాలు పథకాలపై ఆధారపడుతున్నాయని గుర్తుచేశారు. అలాగే బంగారం స్మగ్లింగ్ కేసు, శబరిమల ఆలయం బంగారం తరలింపు ఆరోపణలపై ఎందుకు సమాధానం ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్–2047' దార్శనికతతో ముందుకు సాగుతోందని పేర్కొన్న రేవంత్, రాష్ట్రాన్ని ట్రిలియ న్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కేరళలో కూడా ప్రజలు త్వరలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# అభివృద్ధిలో కేరళ అగ్రస్థానం

**ముద్ర న్యూస్ , కేరళ :**
కేరళ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలో అగ్రస్థానంలో నిలుస్తోందని సీఎం పినరయి విజయన్ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023–24లో 79 పాయింట్లతో మొదటి స్థానాన్ని సాధించడం, రాష్ట్ర ప్రగతికి నిదర్శనమని తెలిపారు. ఈ విజయాలు దశాబ్దాలుగా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాల కృషి ఫలితమని, ఇందులో ఇతర పార్టీల పాత్ర పెద్దగా లేదని స్పష్టం చేశారు. కేరళలో అవినీతి అత్యల్ప స్థాయిలో ఉందని, అదే సమయంలో తెలంగాణ ఆరో అత్యంత అవినీతిమయ రాష్ట్రంగా ఉందని విజయన్ వ్యాఖ్యానించారు. గత ఏడాది నవంబర్ నాటికి కేరళను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దామని, వేలాది కుటుంబాలకు ప్రత్యేక ప్రణాళికల ద్వారా ఉపాధి కల్పించామని వెల్లడించారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తీసుకెళ్లేందుకు విజింజం పోర్ట్ వంటి ప్రాజెక్టులు కీలకమని తెలిపారు. ఐటీ రంగంలో 10% ఎగుమతుల లక్ష్యంతో కేరళ ముందుకు సాగుతోందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కూడా కేరళ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు ప్రతిస్పందిస్తూ, రాజకీయ విభేదాలను వ్యక్తిగత విమర్శలుగా మార్చకూడదని సూచించారు. కేంద్రం అమలు చేస్తున్న సమాఖ్య వ్యతిరేక విధానాలపై కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని గుర్తు చేశారు. మైనారిటీల హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణలో రాజీ పడబోమని విజయన్ స్పష్టం చేశారు. మొత్తంగా, 'నవ కేరళ' నిర్మాణం లక్ష్యంగా సాగుతున్నామని, రాజకీయాల్లో భాషా పరిమితులు పాటించడం అవసరమన్నారు.

# బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ముక్కలవ్వడం ఖాయం

## రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర హెచ్చరిక

**ముద్ర డెస్క్ :**
సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చల్లబడక ముందే భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం మరోసారి తారాస్థాయికి చేరింది. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన అత్యుత్సాహపూరిత రెచ్చగొట్టే వ్యాఖ్యలపై భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉక్కుపాదం మోపారు. దేశ సార్వభౌమాధికారంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో హెచ్చరిస్తూ పాకిస్థాన్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు.



**ఖవాజా ప్రగల్భాలు..**
ఇటీవల ఒక ప్రకటనలో పాక్ మంత్రి ఖవాజా మాట్లాడుతూ భారత్‌తో యుద్ధం సంభవిస్తే పాక్ సైన్యం ఏకంగా కోల్‌కతా వరకు చొచ్చుకు వస్తుందంటూ అర్థరహిత వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి ప్రగల్భాలు పలుకుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే వ్యాఖ్యలు భారత రాజకీయ వర్గాల్లో, రక్షణ శాఖలో ఆగ్రహం కలిగించాయి.

**చరిత్రను గుర్తు చేసిన రాజ్‌నాథ్**
ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన రాజ్‌నాథ్ సింగ్ అత్యంత కరుకుగా సమాధానమిచ్చారు. బెంగాల్ లేదా భారత భూభాగంపై కన్నేస్తే ఈసారి పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఊహించడం కూడా కష్టమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన 1971 నాటి చారిత్రక యుద్ధాన్ని గుర్తు చేస్తూ పాక్ నాయకత్వానికి చురకలు అంటించారు. 'ఇప్పటికి 55 ఏళ్ల క్రితం కూడా ఇలాంటి అహంకారపూరిత మాటలే పాకిస్థాన్‌ను రెండు ముక్కలుగా చేశాయి. ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోకపోతే మళ్లీ అదే పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. పాకిస్థాన్ తన పరిమితులను తెలుసుకుని మాట్లాడాలి.' అంటూ హెచ్చరించారు.

**భారత రక్షణ సన్నద్ధతపై స్పష్టత**
భారత్ ఎప్పుడూ పొరుగు దేశాలతో శాంతినే కోరుకుంటుందని.. కానీ అది బలహీనత కాదని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశ సరిహద్దులను కాపాడటంలో భారత సైన్యం అత్యున్నత ప్రమాణాలతో సిద్ధంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు. "మాపై ఎవరైనా దురాక్రమణకు పాల్పడాలని చూస్తే తగిన రీతిలో బుద్ధి చెప్పే సత్తా మా సైన్యానికి ఉంది" అని ఆయన పేర్కొన్నారు.
రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం పాకిస్థాన్ అంతర్గత సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎప్పుడూ భారత్‌పై విద్వేషాన్ని చిమ్మడం అలవాటుగా మార్చుకుంది. ఇటువంటి బాధ్యతారాహిత్య ప్రకటనలు దక్షిణ ఆసియాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయి. పాకిస్థాన్ ఆర్థికంగా దివాలా తీస్తున్న తరుణంలో, యుద్ధం వంటి మాటలు మాట్లాడటం ఆ దేశానికే ఆత్మహత్యాసదృశ్యం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశవ్యాప్తంగా రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలకు మద్దతు లభిస్తోంది. విపక్షాలు సైతం దేశ భద్రత విషయంలో ప్రభుత్వానికి అండగా ఉంటామని ప్రకటించాయి.
మొత్తానికి భారత్–పాక్ మధ్య నెలకొన్న ఈ దౌత్యపరమైన ఉద్రిక్తతలు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. యుద్ధం ఎవరికీ మేలు చేయదని, ముఖ్యంగా ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్ వంటి దేశాలు సంయమనం పాటించకపోతే భవిష్యత్తులో ఆ దేశ మ్యాప్ మరింత కుంచించుకుపోయే ప్రమాదం ఉందని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ మాత్రం తన రక్షణ కవచాన్ని మరింత పటిష్టం చేసుకుంటూ శత్రువుల ఆటలు సాగనివ్వమని గట్టి సంకేతాలను పంపింది.

# ఇరాన్ ను ఏం చేస్తాడు..

### ఇరాన్ లో ఒక నాగరికత అంతం కాబోతోందా?
### ఇరాన్ భవితవ్యంపై డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**ముద్ర డెస్క్ :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయ యవనికపై పెను సంచలనాన్ని సృష్టించాయి. ఇరాన్‌లో నెలకొన్న అస్థిరత, రాజకీయ పరిణామాలపై ఆయన స్పందిస్తూ చేసిన పోస్ట్, ఒక వైపు ఆందోళనను, మరోవైపు తీవ్ర చర్చను రేకెత్తించింది. ప్రపంచ చరిత్రలోనే ఇది కీలకమైన మలుపు అని ఆయన అభివర్ణించడం గమనార్హం.

**ఒక నాగరికత అంతం కాబోతోందా?**
ట్రంప్ తన సందేశంలో అత్యంత కఠినమైన పదజాలాన్ని ఉపయోగించారు. "ఈ రాత్రి ఒక సంపూర్ణ నాగరికత నశించవచ్చు, అది



తిరిగి రావడం అసాధ్యం కావచ్చు" అంటూ ఆయన చేసిన హెచ్చరిక అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో కలకలం రేపింది. ఇరాన్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభం ఆ దేశ ఉనికికే ప్రమాదకరంగా మారిందని ఆయన సూచించారు. అయితే, ఇదే సమయంలో ఇరాన్‌లో "పూర్తి స్థాయి పాలన మార్పు" జరుగుతోందని, ఇది ప్రపంచానికి ఒక శుభసంకేతమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**47 ఏళ్ల చీకటి యుగానికి ముగింపు?**
ఇరాన్ ప్రస్తుత నాయకత్వంపై విమర్శలు గుప్పిస్తూ గత 47 ఏళ్లుగా ఆ దేశం దోపిడీ, అవినీతి , మరణాల నీడలో మగ్గిపోతోందని ట్రంప్ ఆరోపించారు. ప్రస్తుత పాలన పోయి, తక్కువ తీవ్రవాద భావాలు కలిగిన తెలివైన నాయకత్వం వస్తేనే ఆ దేశానికి, తద్వారా ప్రపంచానికి మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "ఇరాన్ గొప్ప ప్రజలకు దేవుడు ఆశీర్వదించాలి" అంటూ తన పోస్ట్‌ను ముగించడం ద్వారా ఆయన అక్కడి సామాన్య ప్రజల పట్ల సానుభూతిని ప్రకటిస్తూనే, ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళాన్ని వినిపించారు.
ట్రంప్ వ్యాఖ్యలపై ప్రపంచ దేశాల నాయకులు, రాజకీయ విశ్లేషకులు భిన్న దృక్పథాలతో స్పందిస్తున్నారు. కొందరు నిపుణులు ఈ వ్యాఖ్యలను "బాధ్యతారాహిత్యం" గా పేర్కొంటున్నారు. ఇప్పటికే నిప్పుకోడిలా ఉన్న మధ్యప్రాచ్య పరిస్థితుల్లో ఇటువంటి వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోస్తాయని, యుద్ధ మేఘాలు కమ్ముకునే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరికొందరు విశ్లేషకులు దీనిని ఇరాన్ ప్రజల ఆకాంక్షలకు దొరికిన మద్దతుగా చూస్తున్నారు. ఇరాన్‌లో అంతర్గతంగా పెరుగుతున్న అసమ్మతిని ప్రపంచ దృష్టికి తీసుకురావడంలో ట్రంప్ విజయం సాధించారనిభావిస్తున్నారు.

**ముంచుకొస్తున్న సంక్షోభం**
అంతర్జాతీయ సంబంధాల నిపుణుల ప్రకారం ఇరాన్‌లో పాలన మార్పు అనేది అంత సులభమైన ప్రక్రియ కాదు. ఒకవేళ అస్థిరత ఏర్పడితే అది కేవలం ఇరాన్‌కే పరిమితం కాకుండా మొత్తం ప్రాంతీయ భద్రతను దెబ్బతీసే అవకాశం ఉంది. హింసాత్మక ఘటనలు పెరగడం, శరణార్థుల సమస్య, మరియు ప్రపంచ చమురు మార్కెట్‌పై దీని ప్రభావం పడే ప్రమాదం ఉంది. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం ఒక సోషల్ మీడియా పోస్ట్‌గా కాకుండా అమెరికా భవి ష్యత్ విదేశాంగ విధానానికి సంకేతంగా కూడా కొందరు భావిస్తున్నారు. ఇరాన్ రాజకీయాల్లో రాబోయే కొన్ని రోజులు అత్యంత కీలకం కానున్నాయి. ఒక గొప్ప నాగరికత తనను తాను పునర్నిర్మించుకుంటుందా లేక అస్థిరత కోరల్లో చిక్కుకుంటుందా అనేది కాలమే సమాధానం చెప్పాలి. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ఇరాన్ వైపు ఆసక్తిగా, ఆందోళనగా చూస్తున్నాయి.

### కవితకు కేసీఆర్

# ఆయుధం?

(మొదటి పేజీ తరువాయి)
తీసుకొస్తానని ఆమె సంకేతాలిచ్చారు. ఇది నేరుగా కేటీఆర్ అనుసరిస్తున్న కార్పొరేట్ తరహా రాజకీయాలపై ఆమె చేసిన దాడిగా విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే శక్తి లేదని కవిత విమర్శిస్తున్నారు. ఒకవేళ ఏప్రిల్ 25న ఆమె ప్రకటించబోయే కొత్త పార్టీ పేరులో తెలంగాణ సెంటిమెంట్ బలంగా ఉంటే, క్షేత్రస్థాయిలో ఉన్న గులాబీ శ్రేణులు అయోమయంలో పడటం ఖాయం. బీఆర్ఎస్ కంటే టీఆర్ఎస్ అనే పేరుకే తెలంగాణ సమాజంలో గుర్తింపు ఎక్కువ. ఆ పేరును కవిత గనుక సొంతం చేసుకుంటే, కేసీఆర్ స్థాపించిన సుదీర్ఘ రాజకీయ వారసత్వాన్ని ఆమె తన వైపు తిప్పుకున్నట్లవుతుంది.


**పాత పేరు.. కొత్త ఎజెండా**
తెలంగాణ అస్తిత్వమే పునాదిగా ఎదిగిన కేసీఆర్ కుటుంబంలోనే ఇప్పుడు పేరు కోసం పోరు మొదలైంది. తండ్రి వదులుకున్న అస్త్రమే ఇప్పుడు తనయకు ఆయుధంగా మారింది. ఈ పాత పేరు – కొత్త ఎజెండా వ్యూహం తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని ఎలా మారుస్తుందో చూడాలి. ఒకవేళ కవిత టీఆర్ఎస్‌ను మళ్లీ బతికిస్తే, అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుందా లేదా అన్నది కవిత పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు.

# లేడీస్ స్పెషల్



(మొదటి పేజీ తరువాయి)
పదే పదే చెబుతూనే ఉంది. ఇందులో భాగంగానే మహిళలకు ఉద్యోగాలతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇందిరా మహిళా శక్తి పథకం కింద.. మహిళా సంఘాలకు ఉపాధి మార్గాలు చూపిస్తోంది. ఈ క్రమంలోనే పూర్తిగా మహిళల ఆధ్వర్యంలోనే నడిచేలా తెలంగాణలో 2 పెట్రోల్ బంకులను ఇప్పటికే ఏర్పాటు చేయగా.. అవి లాభాలతో కళకళలాడుతున్నాయి. దీంతో ఇతర జిల్లాల్లోనూ ఏర్పాటు చేసి.. మహిళా శక్తిని చాటాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
ఈ పెట్రోల్ బంకుల్లో సిబ్బంది, మేనేజర్లు, ఆపరేటర్లు చివరికి ఓనర్లు కూడా అందరూ మహిళలే కావడం గమనార్హం. ఇప్పటివరకు ఇందిరా మహిళాశక్తి పథకం కింద సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. వాటికి మంచి లాభాలు వస్తుండటంతో.. మిగిలిన జిల్లాల్లోనూ వీటిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మరో 40 చోట్ల మహిళా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.
ఈ పెట్రోల్ పంపుల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేసింది. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనుండగా.. వీటి కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కూడా చేసుకుంది. ఇందులో దాదాపు సగం అంటే 20 పెట్రోల్ బంకులను.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) యోచిస్తోంది. ఆదిలాబాద్‌లోని కైలాష్‌నగర్.. నల్గొండ జిల్లా గండవారిగూడెం, కుమురం భీమ్ జిల్లా ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లా భూపతిపురం, వికారాబాద్ జిల్లా హకీంపేట్ దుద్యాల్‌లలో కొత్త పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు పనులు మొదలయ్యాయి. వీటితోపాటు కరీంనగర్, మెదక్, ములుగు, సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లోనూ కొత్త బంకులు రానున్నాయి.
హనుమకొండ జిల్లా మడికొండ.. ఖమ్మం జిల్లా వెంకటాపురం, సాదిరెడ్డిపల్లి, ఖానాపురం హవేలి.. కామారెడ్డి జిల్లా మల్తుమ్మెద.. కొత్తగూడెం జిల్లా రామవరం, కొత్తగూడెం.. జనగామ జిల్లా రఘునాథపల్లి.. జగిత్యాల జిల్లా కోరుట్ల.. భూపాలపల్లి జిల్లా మైలారం.. మహబూబ్‌నగర్ జిల్లా పాలకొండ.. మేడ్చల్ జిల్లా అలియాబాద్.. మంచిర్యాల జిల్లా మందమర్రి.. నిర్మల్ జిల్లా సోఫానగర్.. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు, పెద్దాపూర్.. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్, వట్టినాగులపల్లి.. వనపర్తి జిల్లా మిరాస్‌పల్లి.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్.. వరంగల్ జిల్లా రాయపర్తి.. భువనగిరి జిల్లా మల్కాపురం.. సంగారెడ్డి జిల్లా కవేలి, కోదూరులలో ఇప్పటికే కొత్త పంపుల కోసం భూములను సేకరించి మహిళా సంఘాలకు అప్పగించారు.
మరోవైపు.. సిద్దిపేట, నిజామాబాద్, భువనగిరి, జోగులాంబ గద్వాల్ జిల్లా నారాయణపురం, భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం, సూర్యాపేట జిల్లా రేపాల, మహబూబాబాద్ జిల్లా తానంచెర్లలో భూములను గుర్తించగా.. మహిళా సంఘాలకు ఇంకా అప్పగించాల్సి ఉంది.

# కుక్కల దాడిలో చిరుత కూన మృతి



**ముద్ర అమరావతి :**
వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్నభాకరపురం గ్రామ పొలాల్లో కుక్కల దాడిలో చిరుత కూన మృతి చెందింది. రైతు పుల్లారెడ్డి పొలంలో చిరుత పిల్ల మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ డీఆర్వో అన్వర్ హుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కుక్కలు దాడి చేయడంతోనే మృతి చెందినట్లు నిర్ధరించారు. దాని వయస్సు ఒక సంవత్సరం పైబడి ఉంటుందన్నారు. పొలాల్లో చిరుత పులుల సంచారం ఉందేమోనని రైతులు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. చిరుత కూనకు అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బెండకాయ
జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శరీరంలో నీటి సమతౌల్యాన్ని నిలబెట్టడంలో సహాయపడుతుంది.



# డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్ లో ప్రమాదం

- **స్వల్పంగా దెబ్బతిన్న రెండు వాహనాలు**
- **తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శివధర్ రెడ్డి పర్యటన**
- **సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుల పరిశీలన**
- **పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమి పూజ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శివధర్‌రెడ్డి కాన్వాయ్ ట్రయల్ రన్ లో అపశృతి చోటుచేసుకుంది. మంగళవారం ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో జరిగిన ప్రమాదంలో వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర డీజీపీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వెంకటాపురం వద్ద వాహనాలు వేగంగా వెళ్తుండగా, ఒక పోలీసు వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వాహనాలను పక్కకు తొలగించి పరిస్థితిని సమీక్షించారు. డీజీపీ పర్యటనకు సంబంధించి భద్రతా పరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది.

**డీజీపీ పర్యటనకు ప్రాధాన్యత..**

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం పర్యటించారు. కర్రెగుట్టల్లోని పాములూరు సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపును పరిశీలించారు. అనంతరం పోలీస్ ఔట్ పోస్ట్‌కు భూమి పూజ చేసి మారుమూల గ్రామలకు నిర్మిస్తున్న రోడ్లను ఆయన పరిశీలించారు. మావోయిస్టుల నుంచి కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్న వేళ డీజీపీ శివధర్ రెడ్డి పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అక్రమ సొమ్ముతో యూట్యూబ్ ఛానళ్లు

- **కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం**
- **రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ముద్ర, నాగర్ కర్నూల్ :**

అక్రమంగా సంపాదించిన వేల కోట్ల డబ్బుతో బీఆర్ఎస్ పార్టీ రెండొందల యూట్యూబ్ చానెళ్లు కొనుగోలు చేసిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఆ ఛానెళ్లలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వీటిలో ప్రసారమవుతున్న వార్తలను ప్రజలు నమ్మే అవకాశం లేకపోలేదన్నారు. సోషల్ మీడియాను కూడా విరివిగా వినియోగించుకున్న బీఆర్ఎస్.. ప్రభుత్వంపై బురదజల్లుతోందని ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పదవుల వెంట వెళ్లొద్దని, పదవులే మీ వెంట వస్తాయని మంత్రి కార్యకర్తలకు సూచించారు. మంత్రాలకు చింతకాయలు రాలవని గుర్తించాలని, కూర్చున్న వద్ద నుంచే మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకోరాదని, ఫీల్డ్ లోకి వెళ్లి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2029 లో కేంద్రంలో రాహుల్ ప్రధాని కావాలన్నా, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలన్నా కార్యకర్తల పాత్ర ముఖ్యమన్నారు. పార్టీని బూత్ లెవెల్ నుంచి బలోపేతం చేయాలన్నారు. ప్రతి బూత్ లెవెల్ కార్యకర్త రోజుకు గంట సేపు కేటాయించి ప్రజల సమస్యలు విని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# కల్తీ కల్లు కేసుల్లో నిర్లక్ష్యం?

- **సీఎం జోక్యం కోరిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్**



**ముద్ర, హైదరాబాద్:**

కుకట్‌పల్లి, బాలనగర్ ప్రాంతాల్లో 2025 జూలైలో కల్తీ కల్లు సేవించి 14 మంది మరణించారు. దాదాపు 100 మంది ఆసుపత్రిలో చేరిన ఘటనపై నిషేధ & ఎక్సైజ్ శాఖ చర్యలు తగిన విధంగా లేవని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కి లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ ఘటనకు సంబంధించి 13 కేసులు నమోదు చేసినప్పటికీ, ఇప్పటివరకు చార్జ్‌షీట్లు దాఖలు చేయలేదని అన్నారు. కొంత మందిని అరెస్ట్ చేసినా, చార్జ్‌షీట్లు లేకపోవడంతో వారు బెయిల్‌పై విడుదలయ్యారని తెలిపింది. దీంతో కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రగ్స్ కేసుల్లో ప్రభుత్వం వేగంగా స్పందించి ప్రత్యేక దర్యాప్తు బృందాలు (ఎస్ఐటీ) ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటుందని గుర్తుచేసిన ఫోరం, అదే తీరు కల్తీ కల్లు ఘటనలో కనిపించడం లేదని విమర్శించింది. కల్లు సాధారణంగా బలహీన వర్గాలు సేవించే పానీయం కావడంతో ఈ కేసులను నిర్లక్ష్యం చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేసింది. కల్లు విక్రేతలు క్లోరల్ హైడ్రేట్, డయాజెపామ్, ఆల్ప్రాజొలామ్ వంటి హానికర రసాయనాలు కలిపి విక్రయిస్తున్నారని, ఇది ప్రాణాంతకమని ఫోరం హెచ్చరించింది. లైసెన్సు పొందిన దుకాణాల నుంచే కల్లు సేవించి ఈ ఘటనలు జరిగాయని, అందువల్ల బాధితులకు పరిహారం చెల్లించే బాధ్యత ఎక్సైజ్ శాఖదేనని పేర్కొంది.అదేవిధంగా, నిందితుల వివరాలు వెల్లడించడంలో ఎక్సైజ్ శాఖ గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తున్నదని ఫోరం తెలిపింది. ఈ నేపథ్యంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ముఖ్యమంత్రిని పలు డిమాండ్లు చేసింది. మరణించిన వారి కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు, ఆరోగ్యం దెబ్బతిన్న వారికి కూడా సాయం చేయాలని కోరింది. కేసులను వేగంగా విచారించి నిందితులకు కఠిన శిక్షలు విధించాలన్నది మరో డిమాండ్. అలాగే కల్లు తీయగల చెట్లు లేని ప్రాంతాల్లో దుకాణాలు అనుమతించకూడదని, దుకాణాలపై నిరంతర తనిఖీలు చేసి నమూనాలు పరీక్షించాలనీ సూచించింది. డ్రగ్స్‌పై చేస్తున్నట్లే కల్తీ కల్లు ప్రమాదాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఫోరం కోరింది.

# కాంగ్రెస్ భక్షక పాలన

- **ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములపై సీఎం నజర్**
- **ఇండస్ట్రియల్ పార్కుల పేరిట నోటిఫికేషన్లు**
- **భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు**
- **భూ బాధితుల పరామర్శించేందుకు వెళ్లిన హరీష్ రావు**
- **హరీష్ రావు సహా కీలక నేతల హౌస్ అరెస్ట్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో నడుస్తున్నది 'ప్రజా పాలన' కాదనీ 'భక్షక పాలన' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలైన వికారాబాద్, భువనగిరిలో ఎక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములు ఉంటే, అక్కడ ఇండస్ట్రియల్ పార్కులు అంటూ నోటిఫికేషన్లు ఇస్తున్న ప్రభుత్వం ఆయా ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తున్న బాధితులను పరామర్శించేందుకు మంగళవారం వెళ్తున్న ఆయన్ను పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి, ఆయన బయటకు రాకుండా అన్ని మార్గాలను మూసి వేశారు. హరీష్ సహా కీలక నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. దళితులు, పేద వర్గాల భూములపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దండయాత్ర చేస్తోందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, ప్రశ్నించే హక్కు అని మాట్లాడే రేవంత్ రెడ్డి ప్రభుత్వం, శాంతియుతంగా సమావేశం ఏర్పాటు చేసుకున్న కళ్లాపూర్ వద్ద టెంట్లను పీకేయడం, మహిళలను అరెస్టు చేయడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలన్నీ కేవలం భూముల చుట్టూనే తిరుగుతున్నాయన్న ఆరోపించారు. పరిశ్రమల కోసం పేదల పొట్ట కొట్టే భారీ కుట్ర జరుగుతోందని విమర్శించారు.

**పోరాటం ఆగదు:**

22ఏ నిషేధిత జాబితాను తక్షణమే రివ్యూ చేసి ఎత్తివేయాలని, ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని రైతులకు భూములు తిరిగి ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అప్పటి వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాకు సీఎం, స్పీకర్ ఉన్నా, అది జిల్లాకు శాపంగా మారిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

**కచ్చితంగా పరిగి వెళ్లి తీరుతా..**

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీలకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, ఒకవేళ ప్రాజెక్టుల కోసం భూములను సేకరిస్తే పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా, ఎకరాకు కోటి రూపాయల విలువ ఉన్న భూమిని కేవలం రూ.10 లక్షలకో, రూ.20 లక్షలకో గుంజుకుంటున్నారని ఆరోపించారు. 'పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట రైతులు భూములు కోల్పోతున్నారు. తాము భూములు ఇవ్వలేమని వారు కన్నీరుమున్నీరవుతుంటే, అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి భక్షకుడిలా మారారు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పోలీసులు తనను అడ్డుకోలేరని, ఖచ్చితంగా పరిగి వెళ్లి తీరుతానని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# అధిష్ఠానం కొత్త వ్యూహం!

- **పీసీసీ చీఫ్ గా 'పొన్నం'?!**
- **బీసీ కోటాలో అనూహ్య మార్పులు**
- **మహేష్‌కు డిప్యూటీ సీఎం?**





**ముద్ర, కరీంనగర్ :**

తెలంగాణ రాజకీయ యవనికపై మరోసారి సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం దగ్గరపడుతున్న వేళ.. అటు సర్కారులోనూ.. ఇటు పార్టీలోనూ కీలక మార్పులు చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేయాలన్న వ్యూహంలో భాగంగా అగ్రనేతల పదవుల విషయంలో అనూహ్య మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

**మారుతున్న సమీకరణాలు:**

ఇప్పటివరకు సీనియర్ నేత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. సామాజిక సమీకరణాల దృష్ట్యా ఆయన పేరు దాదాపు ఖాయమని భావించినప్పటికీ తాజా సమాచారం ప్రకారం అధిష్ఠానం ఆలోచన మారిందని తెలుస్తోంది. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ను ప్రభుత్వంలోకి తీసుకొని.. ఆయనకు డిప్యూటీ సీఎం పదవి అప్పగించే యోచనలో ఢిల్లీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. బీసీ వర్గాల్లో బలమైన పట్టున్న మహేష్ గౌడ్‌కు కీలక బాధ్యతలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ఇమేజ్‌ను పెంచవచ్చని భావిస్తున్నారు.

**పొన్నంకు పీసీసీ పగ్గాలు?**

మరోవైపు పీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. మహేష్ గౌడ్ ప్రభుత్వంలోకి వెళ్తే ఆ ఖాళీని పొన్నం ప్రభాకర్‌తో భర్తీ చేయాలని హైకమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో పొన్నంకు ఉన్న అనుభవం.. దూకుడు స్వభావం పీసీసీ అధ్యక్ష పదవికి సరిగ్గా సరిపోతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. తద్వారా సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా జాగ్రత్త పడుతోంది కాంగ్రెస్.

**ఎందుకు ఈ మార్పు?**

సామాజిక న్యాయంలో భాగంగా బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూనే, పార్టీప్రభుత్వం మధ్య సమన్వయం సాధించేందుకు ఈ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ఇక ప్రాంతీయ సమతుల్యత మంత్రి వర్గంలో కనిపించేలా చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు సముచిత స్థానం కల్పించాలని భావిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు లేదా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్లేందుకు ఈ మార్పులు చేయనున్నట్టు తెలుస్తోంది.

**వచ్చే నెలే క్లారిటీ!**

వచ్చే నెలలో జరగనున్న మంత్రివర్గ విస్తరణతో పాటు పార్టీ పదవుల్లోనూ భారీ మార్పులు ఉండబోతున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. అటు పొన్నం ప్రభాకర్, ఇటు మహేష్ గౌడ్ ఇద్దరూ పార్టీకి విధేయులుగా గుర్తింపు పొందడంతో ఎవరికి ఏ బాధ్యత ఇచ్చినా అది తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని కేడర్ ఆశిస్తోంది. మరి పొన్నంకు 'ప్రభుత్వ' గౌరవం దక్కుతుందా? లేక 'పార్టీ' బాధ్యత వరిస్తుందా? అనేది తేలాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

# గుండె పోటుతో పదేళ్ల చిన్నారి మృతి

- **శోక సంద్రంలో కుటుంబ సభ్యులు**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**



గుండె పోటుతో పదేళ్ల చిన్నారి మృతి చెందిన విషాదకర సంఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన తోపారపు నిషాంత్ (10) బాలుడు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. మూడో తరగతి చదువుతున్న చిన్నారి ఇలా అనూహ్య రీతిలో ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నిషాంత్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, నవిత. కాగా తండ్రి చంద్రశేఖర్ జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. వారి పొలం వద్ద ఉన్న శివాలయంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుండగా, నిషాంత్ అక్కడ ఉత్సాహంగా పాల్గొన్నాడు. అయితే ఆ సమయంలో బాలుడికి ఫిట్స్ రావడంతో ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచాడు. వైద్యులు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. చంద్రశేఖర్, నవిత దంపతులకు నిషాంత్ ఒక్కగానొక్క కుమారుడు. కళ్లముందే ఆడుతూ పాడుతూ ఉన్న బిడ్డ, అప్పటివరకు అందరితో కలిసి అన్నదానంలో పాల్గొన్న చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. చిన్న వయసులోనే గుండెపోటుతో బాలుడు మరణించాడనే వార్త విన్న పొరండ్ల గ్రామస్థులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

# బీఆర్ఎస్ కథ ఒడిసిన ముచ్చట

- **అక్రమంగా సంపాదించుకున్న వాటాలు పంచుకోలేని పరిస్థితి**
- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**ముద్ర, నాగర్ కర్నూల్ :**

తెలంగాణలో బీఆర్ఎస్ కథ ఒడిసిన ముచ్చట అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్‌:కు పరిమితమైతే... ఆమె బిడ్డ కవిత వేరు కుంపటికి రంగం సిద్ధం చేసుకుంటోందన్నారు. కల్వకుంట్ల ఫ్యామిలి దీన స్థితిని చూసి సంతోష్ రావు కళ్లలో ఆనందం వెయ్యి రేట్లు పెరిగిందన్నారు. ప్రస్తుత పార్టీ పరిస్థితులను చూస్తే బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా సంపాదించుకున్న వాటాలు పంచుకోలేని దుస్థితి నెలకొందన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించిన ఆయన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నీళ్ల దోపిడీ పేరిట రూ. 1.20లక్షల కోట్లు గోదావరి పాలు చేశారని ఆరోపించారు. గత పాలకుల అవినీతి, ధన దాహానికి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోచే పరిస్థితి దాపురించిందన్నారు. కాళేశ్వరం దగ్గర ఇచ్చిన ప్రెసెంటేషన్‌లో కేవలం 86వేల ఎకరాలే ఈ ప్రాజెక్ట్ కింద సాగునీరు అందిందని ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ గా పని చేసిన మురళీధర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. అయినా కాళేశ్వరం ప్రాజెక్ట్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ అని దాని కింద రూ. 45 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతున్నాయని కేటీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. బీజేపీని తెలంగాణ ప్రజలు నమ్మారన్న మహేశ్ కుమార్ గౌడ్... అంబానీ, అదానీలకు దోచిపెట్టడమే ప్రధానమంత్రి మోదీ పని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గంలో కూడా సామాజిక న్యాయం పాటించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందన్న ఆయన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం

- **చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్**
- **ఐదుగురు నిందితులు అరెస్ట్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ భారీ మొత్తంలో పట్టుబడ్డాయి. డ్రగ్స్ సరఫరా అవుతుందనే పక్కా సమాచారంతో మంగళవారం జాయింట్ ఆపరేషన్ నిర్వహించిన చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు రూ.64.35 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50వేల నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 07.04.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

### చట్టసభలలో మహిళలకు 1/3 రిజర్వేషన్ ఇవ్వటంలో

## పాలకుల చిత్తశుద్ధి ఎంత?

స్వాతంత్రం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటుతున్నప్పటికీ సమాజంలో సగభాగం ఉన్న మహిళల యొక్క స్థానం మాత్రం పురుషులతో సమాన స్థాయికి చేరుకోలేక పోతుంది. భారతీయ సామాజిక నిర్మాణం, సాంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆంక్షలు, మహిళల ఆత్మగౌరవాన్ని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటమే కాకుండా మహిళలకు సంబంధించిన అనేక సామాజిక దురాచారాలు, సమస్యలు తలెత్తడానికి మూల కారణమయ్యాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగానూ మనదేశంలోనూ మహిళల హక్కుల పరిరక్షణకై వారి సమస్యల పరిష్కారానికి అనేక మహిళా ఉద్యమాలు వస్తున్నాయి. మహిళల స్థితిగతులు మెరుగు పడనిదే ప్రపంచ సంక్షేమానికి ఆస్కారం లేదు. "సమాజంలో సగం భాగం స్త్రీలు అందువల్ల స్త్రీ విముక్తిని సాధించకుండా సమాజ విముక్తిని సాధించలేరు". స్త్రీలు అన్ని రంగాలలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, విద్య, వైద్య రంగాలన్నింటి లోనూ వివక్ష కనపడుతుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల పట్ల ఈవక్ష ఇంకా ఎక్కువ. అయితే గత కొంతకాలంగా స్త్రీలలో విద్యుత్ తో పాటు స్వయంగా ఆర్థికంగా ఎదుగుదలకు, రాజకీయ చైతన్యంతో పాటు కొంత ముందుకు వస్తున్నారు.

★ భారత రాజ్యాంగంలోని 14, 15 అధికరణములు స్త్రీలు, పురుషులతో సమానంగా సంపూర్ణ సమానత్వాన్ని ప్రసాదించాయి.73 వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో 33% రిజర్వేషన్ కల్పించారు. దీనిని అనుసరించే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా రాష్ట్రాలు 50% రిజర్వేషన్ కల్పిస్తున్నారు. మహిళలకు సమానంగా రాజకీయ అవకాశాలు కల్పించాలని ప్రతి రాజకీయ పార్టీ వాగ్దానాలు ఇస్తుంటారు. వాగ్దానాలు ఇవ్వడంలో మాత్రం ఒకరికొకరు పోటీ పడుతుంటారు. తీరా కార్యాచరణకు వచ్చేసరికి మహిళలకే పరితమవుతున్నాయి. ఉదా : చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే బిల్లు గత 30 సంవత్సరాలుగా అంటే 1996 సెప్టెంబర్ లో ఆనాటి యు డి ఎఫ్ ప్రభుత్వం దేవ గౌడ్ నాయకత్వన పార్లమెంట్లో ప్రవేశ పెట్టడం జరిగింది. అయితే బిల్లులో జనరల్ మహిళా కోటాలో బడుగు మహిళల కోట మిళితం కావడం, బడుగు మహిళలకు సబ్ కోటా లేకపోవడం, సంపన్న వర్గాలకే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందని కొన్ని పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వాయిదా పడింది. నాటి నుండి వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తుంది. లోకసభలో మహిళల ప్రాతినిధ్యం 1952 నుండి పరిశీలించితే 2024 వరకు నేటివరకు 15 శాతం మించుటలేదు.

#### ప్రస్తుతం ఉన్న మహిళా బిల్లు!

ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం 2024 ఎన్నికలలో లబ్దిపొందెందుకు గాను గత మూడు దశబ్దాలుగా పార్లమెంటు ఏమోదించకుండా ఉన్న బిల్లును హడావిడిగా 2023 సెప్టెంబర్ లో 'నారీ శక్తి వందన్ అదినియమ్' ( మహిళ రిజర్వేషన్ బిల్లు) ను ప్రవేశపెట్టింది. అ సందర్భంగా జరిగిన చర్చలలో 2024 లోకసభ ఎన్నికల నుంచి మహిళలకు రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ తోపాటు మిగతా ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పుడు, కుదరదంటూ రాజ్యాంగ అవరోధాలను ముందుకు తెచ్చారు. 2003 లో వాజ్ పాయి ప్రభుత్వం ఆమోదించిన రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 వరకు నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం లేదని తాజా జనాభా లెక్కల ప్రాతిపదికపై ఆ తదుపరి డిలిమిటేషన్ చేపట్టాల్సి ఉంటుందని.. ప్రతిపక్షాల డిమాండ్ ను ప్రభుత్వం త్రోసిపుచ్చింది.

#### జనగణనను వాయిదా వేస్తూ..

2021 లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్) కోవిడ్ మహమ్మారీ కారణంగా వాయిదా పడింది. కోవిడ్ పూర్తిగా అంతరించి మూడేళ్లు గడిచిన సెన్సెస్ ను ప్రభుత్వం దాటవేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఈ సంవత్సరం 2026 లో చేపడుతుంది. తొలిసారి డిజిటల్ గా నమోదు చేస్తున్న వివరాలు క్రోడీకరించి గెజిటెడ్ ప్రకటన చేయటానికి సమయం తక్కువే పట్టిన కనీసం సంవత్సరకాలం అవసరము. ఆ తదుపరి నియోజకవర్గాల పునర్విభజన కనీసం మరో సంవత్సరం పైగా పడుతుంది. అందువల్ల 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలుపరిచే అవకాశం రావచ్చు, రాకపోవచ్చు. ఈలోపు 'ఒకే దేశం ఒకేసారి ఎన్నికల' కోసం రాజ్యాంగ సవరణ జరిగి దాని అమలు క్రమం ప్రారంభం కావచ్చు. ప్రస్తుతం ఆ బిల్లు జాయింట్ సెలెక్ట్ కమిటీ పరిశీలనలో ఉన్నది.మహిళ రిజర్వేషన్ శాస్త్రీయంగా ఎలా పనిచేస్తుందన్న అంశంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. 106 వ రాజ్యాంగ సవరణ ప్రకారం 33% రిజర్వేషన్ తో అసెంబ్లీ/ లోకసభ సీట్లలో ఒక్కొక్కటి రొటేషన్ ఆధారంగా మహిళలకు కేటాయిస్తారు. అందులో ఎస్సీ, ఎస్టీ సబ్ కోటా ఉన్నా బీసీ, ఓబీసీ సబ్ కోటా లేదు. దీంతో జనరల్ సీట్లు అగ్రవర్ణాలకు చెందిన మహిళలు మాత్రమే బరిలో ఉండే అవకాశం ఉన్నది.

#### ఎన్నికల్లో లబ్దికోసం ప్రత్యేక సమావేశం

మహిళా రిజర్వేషన్ కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు పై చర్చించడం కోసం కేంద్రప్రభుత్వం పార్లమెంటు బడ్జెట్ సమావేశం తిరిగి ఏప్రిల్ 16నుండి 3 రోజులపాటు ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుంది. మహిళల రిజర్వేషన్ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయడానికి లోకసభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కి పెంచే బిల్లును ఆమోదించేందుకు ఈ సమావేశాలు పెట్టుచున్నామని ప్రధాని మోడీ కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించటం అంటే దీనివెనుకాల 5 రాష్ట్రాల ఎన్నికలలో లబ్దిపోడటమే..

#### ఎన్నికల దృష్ట్యా ఒక రకంగా మహిళల ఓట్లు పొందటమే?

ప్రస్తుత ప్రచారంలో ఉన్న దాని ప్రకారం 543 లోకసభ సీట్లలో రాష్ట్రాల వారి సీట్లను 50 శాతం(273) పెంచుతారు. దాంతో మొత్తం సీట్ల సంఖ్య 816కు పెరుగుతుంది. అందులో 33 శాతం(273) మహిళకు రిజర్వ్ చేస్తారు.2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునరుభజన చేపడతారు. ఇది సింపుల్ గా కనిపించినా, లోతైన సమస్య ఉన్నది. జనాభా నియంత్రణను పాటించి జాతీయ లక్ష్యాలను పరిపూర్తి చేసిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు 66(129 నుంచి (195) పెరిగితే జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాల సీట్లు 200 పెరుగుతాయి. దీనివల్ల దక్షణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోతాయని ఐదు, ఆరు పెద్ద ఉత్తరాది రాష్ట్రాలు కలిసి ప్రభుత్వాన్ని నిర్ణయిస్తాయని ఆందోళన వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా ఈ అంశం లేవనెత్తారు. ఇదిలాఉండగా గత పక్షం రోజుల్లో అమిత్ షా తదితర కొందరు మంత్రులు మహిళా రిజర్వేషన్ అమలుకు ఎన్ డి ఏ పార్టీలతో చర్చించటంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది.

మహిళ రిజర్వేషన్ కు కాంగ్రెస్ ఆది నుంచి కట్టుబడి ఉందని.. రిజర్వేషన్ అమలు కోసం తక్షణమే అఖిలపక్ష పార్టీల సమావేశం పెట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందున పోలింగ్ ముగిశాక పార్టీలతో సమావేశం పిలవాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండు చేస్తున్నప్పటికీ అధికారలో ఉన్న ప్రభుత్వం స్పందించకుండా ఏకపక్ష ధోరణి ప్రదర్శించటంతో ఆ పార్టీ వ్యవహరించుతున్నతీరు అవకాశవాద విధానాలకు..వారి చిత్తశుద్ధి ఏపాటిదో చెప్పకనే చెప్పుతుంది..

**- ఉజ్జిని రత్నాకర్ రావు.. 9490952646**

## పండుగల సంబరాల వెనుక దాగిన విషాదం

**- హోలీ రోజున మునిగిపోవడాలు.. వందల ప్రమాదాలు**
**- ఇది కేవలం అపఘాతమా? లేక సామాజిక భద్రతా వైఫల్యమా?**

పండుగలు అనేవి మనుషుల జీవితాల్లో ఆనందం, ఐక్యత, విశ్రాంతి కలిగించాల్సిన సందర్భాలు. కానీ అదే పండుగల రోజుల్లో అనేక కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంటే ఒక మౌలిక ప్రశ్న తప్పనిసరిగా ముందుకు వస్తుంది. ప్రజల ఇళ్లలో కన్నీరు నింపే రోజును నిజంగా పండుగ అని పిలవ గలమా?



ఇటీవల హోలీ పండుగ సందర్భంగా దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలు ఈ ప్రశ్నను మరింత తీవ్రంగా నిలబెడుతున్నాయి. గుజరాత్ రాష్ట్రంలో ధూలేటి వేడుకల సందర్భంగా నదులు, కాలువలు, చెరువుల వద్ద స్నానం చేయడానికి వెళ్లిన అనేక మంది ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 31 మంది ప్రాణాలు కోల్పోయారు. చిన్న పిల్లలు, యువకులు, సాధారణ కుటుంబాలకు చెందిన ప్రజలు ఈ ప్రమాదాల్లో బలయ్యారు. సూరత్, వడోదర, అహ్మదాబాద్, మహిసాగర్, ఆరావళి, మెహ్సానా, అమ్రేలి వంటి అనేక జిల్లాల్లో విడివిడిగా జరిగిన ఈ సంఘటనలు అనేక కుటుంబాలకు మర్చిపోలేని దుఃఖాన్ని మిగిల్చాయి.

ఇదే సమయంలో మధ్యప్రదేశ్‌లో కూడా హోలీ రోజు ప్రమాదాల సంఖ్య భారీగా పెరిగింది. అధికారిక సమాచారం ప్రకారం హోలీ రోజున రాష్ట్రవ్యాప్తంగా 948 రోడ్డు ప్రమాదాలకు 108 అంబులెన్స్ సేవ స్పందించింది. సాగర్ జిల్లాలో అత్యధికంగా 67 ప్రమాదాలు నమోదయ్యాయి. విదిషలో 55, ఇండోర్‌లో 46, జబల్పూర్‌లో 45, రేవా మరియు సత్నాలో ఒక్కొక్కటిగా 42 కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర రాజధాని భోపాల్‌లో కూడా 39 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

ఒకే రోజు ఇంత పెద్ద సంఖ్యలో ప్రమాదాలు, ప్రాణనష్టం చోటు చేసుకోవడం యాదృచ్ఛిక సంఘటనగా మాత్రమే చూడదగినదా? లేక ఇది సామాజిక భద్రతా వ్యవస్థ వైఫల్యానికి సంకేతమా? అనే ప్రశ్న తప్పనిసరిగా తలెత్తుతుంది.

పండుగల సమయంలో ప్రజలు పెద్ద సంఖ్యలో బయటకు వస్తారని ప్రభుత్వాలకు ముందే తెలుసు. అలాంటప్పుడు ప్రమాదకర నదులు, కాలువలు, చెరువుల వద్ద భద్రతా చర్యలు ఎందుకు ఉండవు? ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారా? పండుగల సమయంలో అక్కడ పోలీసులు లేదా స్థానిక పరిపాలన పర్యవేక్షణ ఏర్పాటు చేశారా? కాలువలు, సరస్సుల వద్ద రక్షణ బృందాలు సిద్ధంగా ఉన్నాయా?

రోడ్ల విషయానికి వస్తే కూడా ప్రశ్నలు ఇదే విధంగా నిలుస్తాయి. పండుగల సమయంలో మద్యం సేవించి వాహనాలు నడిపే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిసినప్పటికీ, ప్రత్యేక ట్రాఫిక్ తనిఖీలు ఎంతవరకు జరిగాయి? ప్రమాదాలను తగ్గించేందుకు తగిన నియంత్రణ చర్యలు తీసుకున్నారా?

ఇక్కడ మరో ముఖ్యమైన కోణం కూడా కనిపిస్తుంది. పండుగల సమయంలో ప్రజలను అత్యంత ఉత్సాహంతో "ఎంజాయ్ చేయాలి", "సెలబ్రేట్ చేయాలి", "జోష్‌లో ఉండాలి" అనే సంస్కృతిని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నారు. మీడియా, మార్కెట్ వ్యవస్థలు, వినోద రంగం, రాజకీయ నాయకత్వం, అందరూ కలిసి ఈ ఉత్సాహాన్ని మరింత పెంచే వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

అప్పుడు సహజంగానే ఒక సందేహం కలుగుతుంది. కొద్దిమంది రాజకీయ–ఆర్థిక వర్గాల సంతోషం కోసం సమాజాన్ని నిరంతరం సంబరాల మూడ్‌లో ఉంచుతున్నారా? ప్రజలు ఎప్పుడూ పండుగల జోష్‌లో ఉంటే, పాలనలో ఉన్న లోపాలు, ప్రజా సమస్యలు, భద్రతా వైఫల్యాలు వంటి అంశాలపై ప్రజల దృష్టి తగ్గిపోతుందా?

ఇలాంటి సంఘటనలు ఎక్కువగా విడివిడిగా చోటుచేసుకోవడం వల్ల అవి పెద్ద జాతీయ చర్చగా మారడం లేదు. ఒకే ప్రదేశంలో ఒక పెద్ద ప్రమాదం జరిగితే దేశం మొత్తం స్పందిస్తుంది. కానీ అనేక ప్రాంతాల్లో విడివిడిగా జరిగే ఈ మరణాలు వార్తల్లో చిన్న శీర్షికలుగా మాత్రమే మిగిలిపోతాయి. ఫలితంగా బాధ్యత ఎవరిది అనే ప్రశ్న కూడా పెద్దగా ముందుకు రావడం లేదు.

కానీ వాస్తవానికి పండుగల సమయంలో జరిగే ఈ ప్రమాదాలు కేవలం వ్యక్తుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నవి కావు. సమగ్ర భద్రతా ప్రణాళిక లేకపోవడం, పర్యవేక్షణ లోపించడం, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం కూడా ఈ విషాదాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

పండుగలు సమాజానికి ఆనందాన్ని ఇవ్వాలి. కానీ అవే రోజులు అనేక కుటుంబాలకు జీవితాంతం మాయంకాని దుఃఖాన్ని మిగిల్చితే, ఆ సంబరాల అర్థం ఏమిటి? రంగులు ఎండిపోతాయి, సంగీతం ఆగిపోతుంది, సంబరాలు ముగుస్తాయి. కానీ ఆ రోజే కోల్పోయిన ప్రాణాల బాధ మాత్రం కుటుంబాలకు ఎప్పటికీ మాయంకాదు.

అందుకే పండుగల ఉత్సాహాన్ని ప్రోత్సహించే ముందు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి: ప్రజల ప్రాణాలు సురక్షితంగా లేకపోతే, ఆ సంబరం ఎవరి కోసం? పండుగలు నిజంగా ప్రజల ఆనందం కోసం జరగాలంటే, ముందుగా ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే బాధ్యతను పాలకులు స్వీకరించాలి. లేకపోతే ప్రతి సంవత్సరం సంబరాల మధ్యే కనిపించని విషాదాల చరిత్ర మళ్లీ మళ్లీ పునరావృతం అవుతూనే ఉంటుంది.



**- పాపని నాగరాజు**

## సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు


#### ఏప్రిల్ 8...బంకించంద్ర ఛటర్జీ వర్ధంతి

బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు.

బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకిం చంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం.

బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని.

ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని,



కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది.

దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన ర తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందే మాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.

భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటోపాధ్యాయను ప్రసంసించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## దేవాదాయ అధికారిణి కళింగిరి శాంతి అరెస్ట్

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కళింగిరి శాంతిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. విజయవాడ, తాడేపల్లిలోని ఆమె నివాసాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. సుమారు రూ.50 కోట్లకు పైగా స్థిరాస్తుల పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పక్కా ఆధారాలు సేకరించిన అనంతరం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తన పదవిని దుర్వినియోగం చేసి బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

ఇక గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆమెను సర్వీసు నుంచి తొలగించాలన్న ఫైల్ పెండింగ్‌లో ఉండగా, కోర్టు స్టేతో తిరిగి విధుల్లో చేరిన కొద్దిరోజుల్లోనే ఏసీబీ చర్యలు తీసుకోవడం సంచలనం రేపుతోంది. ఆమెపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



## బీరకాయ

తక్కువ కాలరీలు, ఎక్కువ నీరు కలిగి ఉండి శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. చర్మానికి కూడా మంచిది.




## సంక్షిప్తంగా..

### సీఎం సహాయనిధి ఒక గొప్ప వరం



**ముద్ర, గద్వాల:** సీఎం సహాయనిధి ఎంతో మంది నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. గద్వాల నియోజకవర్గంలోని ధరూర్, మల్దకల్, గద్వాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

### పల్నాడు ఎక్స్ ప్రెస్ ను తాండూర్ వరకు పొడిగించాలి

ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ స్టేషన్ వరకు వచ్చే పల్నాడు ఎక్స్ ప్రెస్ ట్రైన్ తాండూర్ వరకు పొడిగించాలని తాండూర్ బీజేపీ కౌన్సిలర్లు కౌన్సిలర్లు నాగారం మల్లేశం, అంతారం కిరణ్, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ను కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సౌత్ సెంట్రల్ రైల్వే కు లేఖ రాశారు. ఫ్లోర్ లీడర్ నాగారం మల్లేశంను ఎంపీ సన్మానించారు. ముగ్గురు కౌన్సిలర్లు కు రూ.10 లక్షలు వార్డ్ డెవలప్మెంట్ ఫండ్ మంజూరు చేశారు.

### పరీక్ష కేంద్రాల తనిఖీ

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు,సెల్ ఫోన్లు అనుమతించరాదన్నారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వేసవి ఎండల దృష్ట్యా విద్యార్థులు ఏదైనా అస్వస్థతకు గురైతే,వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

### అభివృద్ధిపై కమిషనర్‌కు వినతి

**ముద్ర కూకట్‌పల్లి:** నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతం కోరుతూ టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ, లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మట్టి తరలిస్తున్న ట్రాక్టర్, జేసిబి సీజ్


**ముద్ర, గద్వాల:** అనుమతులు లేకుండా గ్రామ కంఠం భూమి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఒక జేసీబీని మంగళవారం సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు కేటిదొడ్డి తహసీల్దార్ కరుణాకర్ తెలి పారు. పక్కా సమాచారంతో తహసీల్దార్ కరుణాకర్, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాలుగు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌లను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు..

## జూరాల అడుగంటుతోంది

**ఉమ్మడి పాలమూరు జిల్లా వర ప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరువకు వచ్చింది. మండుతున్న ఎండలతో నీటి ఆవిరి పెరిగి, జలాశయాల్లో నీరు అడుగంటుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, 3.71 టీఎంసీలు డెడ్ స్టోరేజీలో ఉంటుంది. మిగిలిన నీటిని మాత్రమే గ్రావిటీ ద్వారా విడుదల చేసుకోవడానికి అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో 4.212 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే 3.71 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను విడుదల చేసుకోవడానికి వీలుగా 0.5 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. అది కూడా విడుదల చేస్తే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో డెడ్ స్టోరేజీకి చేరుకుంటుంది.**

పడిపోతున్న భూగర్భ జలాలు .. ఆందోళన చెందుతున్న అన్నదాతలు





**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గడిచిన కొన్నేళ్లతో పోల్చితే ఈసారి కృష్ణానదికి ఎక్కువ వరద రోజులు నమోదయ్యాయి. జూన్ నుంచి మొదలుకుని నవంబరు వరకు ఎగువ ప్రాంతాల్లో వర్షం కురవడంతో ఒక పంట కాలం మొత్తం వరద రోజుల్లోనే పూర్తయ్యింది. వానాకాలం పంట పూర్తయిన తర్వాత కూడా ప్రాజెక్టులో నీళ్లు పుష్కలంగా ఉండటంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో జూరాల కుడి, ఎడమ కాలువల మీద ఆధారపడిన పంటలకు వారబందీ పద్ధతిలో సాగునీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఏప్రిల్ 15 వరకు ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని గత నెలలో ఇరిగేషన్ ఆఫీసర్లు ప్రకటించారు. చెప్పిన టైం కంటే వారం రోజుల ముందే నీటి విడుదలపై సందిగ్ధత నెలకొంది. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో ఇరు రాష్ట్రాల మంత్రులు, ప్రతినిధులు ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కృష్ణా జలాలను వృథా కాకుండా ఒడిసి పట్టుకోవాల్సిన బాధ్యత తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల పైన ఉందన్నారు కృష్ణా నదికి వరదలు సంభవించినప్పుడు వందల టీఎంసీ ల నీరు సముద్రంలోకి వృథాగా పోతుందని, ఈ నీటిని ఎలా సద్వినియోగ పరచుకోవాలనే అంశంపై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. కృష్ణా జలాలను కాపాడుకోగలిగితే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సాగు, తాగు నీటి అవసరాలు తీర్చవచ్చని అభిప్రాయపడ్డారు.జూరాల అడుగంటుతున్న నీటి మట్టాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీల నీరు విడుదల చేయాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిసింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని గద్వాల, వనపర్తి జిల్లాల తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కర్ణాటక అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూరాల ప్రాజెక్టులో 9.657 టీఎంసీలకు గాను 4.212 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఎండకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ మండుతున్న ఎండలతో నీటి ఆవిరి పెరిగి, జలాశయాల్లో నీరు అడుగంటుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితి ఇలా కొనసాగితే రానున్న నెలల్లో కూడా తాగునీటికి ఇబ్బందులు తప్పవని విశ్లేషకుల అభిప్రాయం. ఒకవేళ కర్ణాటక ప్రభుత్వం 3 నుంచి 5 టీఎంసీల విడుదల చేస్తే తాగునీటికి ఢోకాలేకపోవచ్చు.

### ప్రశ్నార్థకంగా నెట్టెంపాడు

జూరాలలో నీటి మట్టం గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో జూరాల మీద ఆధారపడిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్లు ద్వారా సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. జూరాలలో నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకొని జూరాల కుడికాలువ, ఎడమ కాలువల ద్వారా వారబందీ విధించి తాగు, సాగుకు నీరందిస్తున్నారు. పంట చివరి దశలో ఉండటంతో మరో వారం రోజులు సాగునీరందిస్తే గట్టేక్కే పరిస్థితి ఉందని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు.

### పంటలపై ప్రభావం..

జూరాల కుడి, ఎడమ కాలువల కింద యాసంగి సీజన్ పంటలు చేతికి రావడానికి ఈ నెలాఖరు వరకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం కంకి దశలో 50 శాతం పొలాలు ఉండగా 50 శాతం పొట్ట దశలో ఉన్నాయి. కంకి వేసిన పొలాలకు మరో వారం రోజులపాటు నీటి తడి ఇస్తే సరిపోయే అవకాశం ఉంది. పొట్ట దశలో ఉన్న పొలాలకు ఈ నెలాఖరు వరకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జూరాల ఎడమ కాలువ ఆయకట్టు కింద పంటలు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## మల్కాజ్‌గిరి అభివృద్ధికి సహకరించండి



**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి , ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌లను మంగళవారం కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా భూకబ్జాలు, అభివృద్ధి పనులకు ఎదురవుతున్న ఆటంకాలు, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అల్వాల్‌లో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన 11 గుంటల స్థలంపై కోర్టు స్టే కారణంగా పనులు నిలిచిపోవడం, మల్కాజ్‌గిరి డివిజన్‌లోని విమల దేవి నగర్‌లో బావిని మూసివేసి అక్రమ నిర్మాణం చేపట్టడం, చెరువుల పరిరక్షణ, ఆధునీకరణ పనులు నిలిచిపోవడం, బండ చెరువు పరిరక్షణ, స్మశానవాటికల అభివృద్ధి, బాక్స్ డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతం, పార్కుల అభివృద్ధి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై కూడా చర్చించారు. ఈ సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నిరుగొండ జగదీష్ గౌడ్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మురుగేష్, మేకల రాము యాదవ్ పాల్గొన్నారు.

## రబీలో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

**90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం**
**8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**
**అందుబాటులో 6 కోట్లకు పైచిలుకు గన్నీ బ్యాగులు**
**అనధికార మార్గాల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదు**
**సన్నాలకు రూ.2,389 మద్దతు ధర, రూ.500 బోనస్ సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర**
**సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా**
**-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, హుజూర్‌నగర్:** రబీ సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానుందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం సాయంత్రం హుజుర్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో పెరిగి పోతోందన్నారు. గడిచిన ఖరీఫ్ సీజన్ లో రాష్ట్రంలో దిగుబడి దేశంలోనే సరికొత్త రికార్డ్ నమోదు చేసుకుందన్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే కాదు, కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. రబి సీజన్ లో ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు 16 కోట్లకు పై చిలుకు గన్ని బ్యాగులను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,389తో పాటు అదనంగా 500 బోనస్, సాధారణ రకానికి రూ. 2,369 చెల్లించ నున్నట్లు ఆయన తెలిపారు. ప్రతీ రైతుకు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయబడుతున్నాయని, వీటిలో ఆధునిక మౌలిక వసతులు, తగిన నిల్వ సదుపాయాలు, సక్రమ రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ, రవాణా కోసం 16 కోట్లకు పైగా గన్నీ సంచులు ఇప్పటికే అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని ఒక అధికారి పర్యవేక్షణలో ఉంచి రోజువారీ కొనుగోలు, నాణ్యత తనిఖీలు, సమయానికి చెల్లింపులు, పారదర్శకతను నిర్ధారించనున్నట్లు తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రవాణాలో ఎలాంటి అవరోధాలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరేలా కోత పూర్తయిన వరిని సులభంగా కేంద్రాలకు చేరవేయాలని సూచించారు. అనధికార మార్గాల్లో ధాన్యం మళ్లింపును నివారించేందుకు కఠిన పర్యవేక్షణ చర్యలు అమలులో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉడికించిన బియ్యం కోటాను తగ్గించగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సరఫరా చేసే బియ్యంలో బ్రోకెన్ రైస్ శాతం విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయడం వల్ల రైస్ మిల్లర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి బలంగా తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద ధాన్యం కదలికలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని తెలంగాణ కొనుగోలు కేంద్రాలకు అనుమతించబోమని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా అరుణ్ కుమార్ దేశముఖ్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్.పి నరసింహ స్థానిక ఆర్ డి ఓ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ద్వారానే ఇసుక రవాణా



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో ఇసుక రవాణా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు "మన ఇసుక – మన వాహనం" విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఆన్‌లైన్ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు లేదా రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల, వంగూరు మండలాల్లోని మొల్గర, పెదాపూర్, ఉల్పర గ్రామాల్లో కొనసాగుతున్న ఇసుక రీచ్‌లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకం, రవాణా విధానాలను పరిశీలించి, అధికారులతో పాటు స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



**ముద్ర, గద్వాల:** గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఉండవెల్లిలోని ప్రభుత్వ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంటగది, భోజనశాల, నిల్వ గది, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంట గదిలో ఎల్లప్పుడూ శుభ్రతను పాటిస్తూ, ఆరోగ్యానికి అనుకూలమైన వాతావరణం ఉండేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టోర్ రూమ్ లో అవసరమైన సరుకులు తగిన మోతాదులో నిల్వ ఉంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలని ఆదేశించారు. తరువాత విద్యార్థినులతో అన్నింటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదివి రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన మార్గదర్శనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తహసీల్దార్ ధరణీషా, ఎంపీడీఓ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




**ముద్ర, కుత్బుల్లాపూర్:** ఉచిత వైద్య శిబిరాన్ని నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 129 – సూరారం డివిజన్ సంజయ్ గాంధీనగర్ లోని మారుతి మెడికల్ హాల్ వద్ద పుప్పాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. బస్తీలోని హరి హర క్షేత్రం శివాలయం నిర్మాణ పనులను పరిశీలించారు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు మధుమోహన్, ఫెరోజ్, సాజిత్, ప్రశాంత్, బషీరుద్దీన్, ప్రభుదాస్, రవి, ముకుందం, ప్రభుదాస్, కోల శ్రీకాంత్, హేమలతా రెడ్డి, లావణ్య, ధనలక్ష్మి , వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్టీసీ లక్ష్మీనారాయణ, భద్రప్ప, సంజీవరెడ్డి, వరప్రసాద్, అనిల్, రవితేజ, సుమన్, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటేనే అనుకున్నవి సాధిస్తాం









**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే, అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా గద్వాల పాత డీఎంహెచ్వో కార్యాలయం వద్ద గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి , డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, డిడబ్ల్యుఓ సునంద, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్ లో..**

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. డీఎంహెచ్‌వో, వైద్యులు, అధికారులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కాప్రాలో..**

**ముద్ర, కాప్రా:** కార్మికులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలంటే తరచూ హెల్త్ క్యాంపుల్లో పాల్గొనాలని సూచించారు. ప్రసాద్ హాస్పిటల్, నాచారం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మ, మెడికల్ ఆఫీసర్ మమత, మేనేజ్‌మెంట్ ప్రతినిధి రవి, నాచారం డీఈఈ రవిచంద్, శాంతి సూపర్వైజర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 08-04-2026
www.mudranews.in | @mudranews

6 ఉత్తర తెలంగాణ
కరీంనగర్, ఆదిలాబాద్
Karimnagar, Adilabad

కాకరకాయ

చెడు చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. వేడి కాలంలో రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయ పడుతుంది.





# ప్రజా ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

- **కథలాపూర్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**కోరుట్ల, ముద్ర:**

ప్రజా ప్రభుత్వంలో రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కథలాపూర్ మండల కేంద్రంలో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని అర్హులైన 86 మంది లబ్ధిదారులకు 31 లక్షల 81 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నామని అన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు నేడు నిర్విరామంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2400లు మద్దతు ధర ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితీ నాగరాజు, మార్కెట్ చైర్మన్ పుంద్ర నారాయణ రెడ్డి, చెదలు సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన విప్

కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలోని గుంటి పెరుమండ్ల రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఇటీవల పనులు మొదలై మట్టిరోడు పూర్తయిన సందర్భంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనులు తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. విప్ వెంట కథలాపూర్ సర్పంచ్ శేఖర్ తదితరులు ఉన్నారు.



# ఎస్సెస్సీ స్పాట్ మూల్యాంకన భత్యాలు పెంచాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

ఎస్సెస్సీ స్పాట్ మూల్యాంకన భత్యాలను పెంచాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ చేశాయి. ఈ మేరకు ధరూర్ లోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో మంగళవారం నిర్వహిస్తున్న ఎస్సెస్సీ స్పాట్ మూల్యాంకన కేంద్రం వద్ద టిటిజెఏసి, యుఎస్పిసి, జాక్టో రాష్ట్ర శాఖల పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. 2025లో నిర్వహించిన ఎస్సెస్సీ మూల్యాంకనానికి సంబంధించిన రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. అక్టోబర్ 2024లో నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన రెమ్యునరేషన్ తక్షణమే చెల్లించాలన్నారు. గత 7 సంవత్సరాలుగా ఎస్సెస్సీ స్పాట్ రెమ్యునరేషన్ పెంపు జరగలేదని, కనీసం 50% పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బోయినిపెల్లి ఆనంద్ రావు, బైరం హరి కిరణ్, తిరుకోవెల శ్యాంసుందర్, యాల్ల అమర్నాథ్ రెడ్డి, గంగ నరసయ్య, తుంగూరి సురేష్, ఎన్నం రామరెడ్డి, బోగ రమేష్, భూమేష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, రామచంద్రం, గట్ల సం తోష్, జితేందర్ రెడ్డి, బన్న, విష్ణప్రసాద్, వేల్పుల స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు కొనసాగిన నిరసనలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

గతేడాది పదోతరగతి మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పారితోషికం డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర శాఖల పిలుపు మేరకు సెయింట్ థామస్ ఉన్నత పాఠశాల మూల్యాంకన కేంద్రంలో మధ్యాహ్న భోజన సమయంలో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావు, ఎస్టియు టిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, లక్ష్మణ్, టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు దాసరి శంకర్, టియుటిఎఫ్ అధ్యక్షులు తోడిశెట్టి రవికాంత్, టిపిటిఎఫ్ అధ్యక్షులు ఏ.విజయ్ కుమార్, డిటిఎఫ్ అధ్యక్షులు మహేంద్ర చారి, తపస్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, టిపిఆర్టియు నాయకులు రవిరాజ్, గంగాధర్, హరిహర నాథ్, టిఆర్టిఎఫ్ నాయకులు ప్రశాంత్, వ్యాయామ సంఘ నాయకులు రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించాలి



- **ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఆర్ దిలీప్ కుమార్ నాయక్**
- **ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం**

**ముద్ర, మహాదేవపూర్:**

గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం పట్ల స్పృహను పెంపొందిం చాలని, వైద్యంతో పాటుగా నైతిక మద్దతును వారికీ అందిం చాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఆర్ దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చెల్పూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసి యేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ పుప్పాల శ్రీని వాస్, కంప అక్షయ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, పి.హెచ్.సి డాక్టర్ స్వాతి, న్యాయవాదులు మంగళంపల్లి రాజ్ కుమార్, దుప్పటి ప్రవీణ్, గ్రామ సర్పంచ్ రజిత తదితరులు పాల్గొన్నారు.

## సేవకు ప్రతిరూపం నర్సింగ్ వృత్తి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

సేవాభావానికి ప్రతిరూపం నర్సింగ్ వృత్తి అని నిర్మల్ మున్సి పల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోగుల పట్ల అత్యుత్తమమైన సేవలను అందించే వృత్తి నర్సింగ్ వృత్తన్నారు. అలాంటి వృత్తిలోకి నిర్మల్ జిల్లా కేంద్రంలోని కళాశాల నుండి దాదాపు 120 మంది అతి అడుగు పెట్టబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ రాజేందర్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ పవన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శకుంతల, కౌన్సిలర్ రాజు, కొండాజీ రాఘవేంద్ర చారి తదిత రులు పాల్గొన్నారు.




# గోదావరి పుష్కరాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**



గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించింది. ఈ పరిశీలనకు ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల కోసం చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఘాట్‌ల అభివృద్ధి పనులు, రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సరఫరా, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఈ.ఈ.పి.ఆర్. లక్ష్మణ్ రావు, ఈ.ఈ. ఆర్ అండ్ బి శ్రీనివాస్, ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల సేవలు అమూల్యం

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**ముద్ర, మహాదేవపూర్:**



ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కొనియాడారు. మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథ మిక ఆరో గ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భం గా ఆశా కార్యకర్తలకు ఆశా డే శుభాకాంక్షలు తెలిపారు. ఆశ వర్కర్లు గ్రామస్థాయిలో అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని పక్కడ్బందీగా అమలు చేయాలని వైద్య సిబ్బందిని కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మిరప తోటలను సందర్శించిన శాస్త్రవేత్తలు

**మహాదేవపూర్, ముద్ర:**



మిరప పంటలో దిగుబడి, నాణ్యతను పెంచేందుకు సరైన పద్ధతుల్లో పంట అవశేషాల నిర్వహణ, నేల ఆరోగ్య సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, కీటక-వ్యాధి నియంత్రణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు ఆధునిక పద్ధతు లను అనుసరించడం ద్వారా ఖర్చులను తగ్గించి లాభాలను పెంచుకోవచ్చని సూచించారు. మహ బూబాబాద్ జిల్లా, మల్యాల ఉద్యాన పరిశోధన కేంద్రాల నుండి శాస్త్రవేత్త, హెడ్ డా. ఏ.అడ్లూరి ప్రశాంత్ కుమార్, చిట్యాల మండలం గోపాలపురంలో సాగవుతున్న మిరప తోటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మిరప కోత అనంతరం చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు విపులంగా వివరించారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయంలో కూరగాయల వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఏ. సునీల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, ఉద్యాన అధికారి మణి, ఉద్యాన విస్తరణ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సత్యనారాయణ స్వామి

**ముద్ర, మహాదేవపూర్:**

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గా సత్యనారాయణ స్వామి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ గా పనిచేసిన రామారావు కలెక్టరేట్ కు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్ సత్యనారాయణ స్వామికి డీటీ యూసుఫ్, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించారు.

## జగిత్యాల మున్సిపల్ లో ఏసీబీ దాడులు..

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఈ దాడుల సందర్భంగా కార్యాలయంలో ఉన్న సిబ్బంది ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి సమాచారాన్ని బయటకు పంపకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కార్యాలయంలోని పత్రాలు, ఫైళ్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పట్టణంలో అనుమతుల మంజూరు, నిర్మాణాల అనుమతుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల పనితీరును సమగ్రంగా పరిశీలిస్తున్నారు. అవినీతి ఆరోపణలతో ఏసీబీ అధికారులు ఉదయం 10 గంటల నుండి సుమారు 10 గంటల పాటు తనిఖలను కొనసాగించారు. సుమారు 15 మంది ఏసీబీ అధికారుల బృందం ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ సీఐ పూర్ణచందర్ మాట్లాడుతూ జగిత్యాల మున్సిపల్ లో రెవెన్యూ విభాగంలో పన్నుల చెల్లింపు విషయంలో భారీగా అకతవకలు జరిగాయని, మున్సిపల్ కి సంబంధించిన ఒక ట్రాక్టర్, 4 ఆటోలు 5 సంవత్సరాల క్రితం మాయం కాగా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదన్నారు. మున్సిపల్ సిబ్బంది ఫోన్ పే, గూగుల్ పే లావాదేవి లు పరిశీలిస్తున్నా మని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

**పొట్లకాయ**



శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది, అలసట తగ్గిస్తుంది. జీర్ణ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది.




## యాదగిరిగుట్టలో ఎస్పీఎఫ్ 10కే రన్

**ముద్ర, యాదగిరిగుట్ట :** టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లాక్రా ఆదేశాల సూచనల మేరకు యాదగిరిగుట్ట ఆలయ భద్రతా ఎస్పీఎఫ్ సిబ్బందికి మంగళవారం ఉదయం 10 కిలో మీటర్ల పరుగు పోటీ నిర్వహించారు. ఈ పరుగు పోటీ తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు సాగిన ఈ పరుగులో అధికారులు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించడం భక్తులకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ కె.శేషగిరి రావు తెలిపారు. ఇటీవల బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భక్తురాలి దీన స్థితిని చూసి చలించిన ఎస్పీఎఫ్ సిబ్బంది కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా సాటి మనిషిని ఆదుకోవడం బాధ్యతగా భావించి ఇన్స్పెక్టర్ కె శేషగిరిరావు ఆదేశాల మేరకు బాధితురాలికి తక్షణ వైద్య సాయం కోసం రూ. 22400 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి ఏఎస్ఐ లు శ్రీనివాస్ రెడ్డి కనకయ్య రాజయ్య నాగేశ్వరరావు మాణిక్ ప్రభు సిబ్బంది మోహన్ రెడ్డి రాజా గౌడ్ పాండు గోపీ నాయక్, నందు నాయక్, కురుమూర్తి రమేశ్, వీరేష్, మురళి, శ్రీకాంత్ రెడ్డి, మహేష్, సిద్దులు సునీల్, కురుమూర్తి సందీప్ రెడ్డి ,కృష్ణ, శేఖర్, యాదగిరి, దుర్గ, రమేశ్, సత్యసాగర్, సూరి, ధర్మేష్, అనిల్ పాల్గొన్నారు.




## నిత్యవసరాల ధరలు తగ్గించాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పేదల నిత్యావసరల ధరలు తగ్గించాలని 9వ వార్డు ఇంద్రమ్మ కాలనీ సింగన్నగూడెం వద్ద సిపిఐఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ మాట్లాడుతూ నిత్యవసర ధరలు ఇష్టం వచ్చినట్లు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల రక్తాన్ని పిలుస్తున్నాయని చెప్పారు. నరేంద్ర మోడీ ఈ పేద వాళ్ల తినుబండారాలు పెరుగుతుంటే కనిపించడం లేదా ధరలను అదుపు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య, పట్టణ నాయకులు కొలుపుల కృష్ణ, చింతల శివ, కుచ్చుల నరసింహ, నోముల లక్షి , హేమలత పాల్గొన్నారు

## నిధులివ్వాలని ఎమ్మెల్యేకు వినతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 22వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలని కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని హైద్రాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 22వ వార్డు పరిధిలో 300మీటర్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజి, కొన్ని చోట్ల సిసి రోడ్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు సిఫారసు చేసి, అభివృద్ధి విషయంలో రాజీపడేది లేదని ఎల్లప్పుడు ప్రజల్లో ఉంటూ సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.





## హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

**ముద్ర ,తుంగతుర్తి:** ఈనెల 9న తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో జరిగే హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రామాలయ అర్చకుడు కాటూరి రామాచార్యులు అన్నారు. మంగళవారం తుంగతుర్తిలోని రామాలయంలో సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ భక్తులు గోపగాని రమేష్ గౌడ్, పులిపంపుల సైదులు గౌడ్, ఆలయ చైర్మన్ ఎనగందుల సంజీవ, కాసం మల్లయ్య, తల్లాడ కేదారి, అంబటి రమేష్, పెండెం మధుసూదన్, బత్తుల శ్రీను, అంబటి రాములు, ఎనగందుల గిరి, గూడూరి శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నిర్మాణాలు వేగవంతం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఐలయ్య

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. వంగపల్లి ప్రాంతంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు కరెంట్, రోడ్లు, మంచినీటి సౌకర్యాలు వంటి మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించి, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీరాములు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉడత ధనకోటికి ఎమ్మెల్యే కుంభం పరామర్శ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉడత ధనకోటిని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకుంటాం..

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్

**ముద్ర, తుంగతుర్తి:** రాష్ట్రంలోని రైతులను అన్ని రంగాల్లో ఆదుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ అన్నారు మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వం అందించే నాణ్యమైన ధర పొందాలని ఎమ్మెల్యే అన్నారు. కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకువచ్చిన ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ప్రతిపక్షాలు తట్టుకోలేక రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డును అందించలేదని విమర్శించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రైతులు గిట్టుబాటు ధర పొందాలంటే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందించే ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2369 మద్దతు ధర పొందాలని అన్నారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. వేసవికాలం దృష్ట్యా కేంద్రాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, సత్యం తాహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ బాబు, కోపరేటివ్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఎస్ కే బడే సాబ్, సొసైటీ సీఈవో యాదగిరి,తుంగతుర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల



వెంకన్న, తుంగతుర్తి,మద్దిరాల, నూతనకల్, నాగారం, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దొంగరి గోవర్ధన్,అవిల మల్లు, తోడుసు లింగయ్య, నాగం సుధాకర్ రెడ్డి, జిల్లా నాయకులు రేగటి రవి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బికోజి,తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు యాదవ్, మాచర్ల అనిల్, కొండ రాజు, పెద్ద బోయిన అజయ్, గంగరాజు,పచ్చిపాల సుమతి తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీలకు సెల్ ఫోన్లు..

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సామెల్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంగన్వాడి సూపర్వైజర్లకు టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడా



నికి ప్రజా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. దీనిలో భాగంగానే డిజిటల్ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం కావడంతో పాటు సమాచార మార్పిడి సులభతరం అవుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా, శిశు సంక్షేమ సేవలను మెరుగుపర్చడానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు.

## శ్రీ గిరి అష్టలక్ష్మి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని సురేంద్రపురి దేవాలయం ఎదురుగా ప్రతిష్టత్మకంగా నిర్మాణం జరుగుతున్న శ్రీగిరి అష్టలక్ష్మీ దేవాలయ 2026–28 సంవత్సర నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం చేశారు. ఛైర్పర్సన్ గా యాద మంజుల అశోక్ గుప్త, ప్రధాన కార్యదర్శి గందే సౌజన్య ప్రేమ్ గాంధీ , కోశాధికారిగా పల్లెర్ల మాదవి నవీన్ లతో పాటు 20 మంది వైస్ చైర్మనులుగా 20 మంది జాయింట్ సెక్రెటరీలుగా 20 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు యాద అశోక్ గుప్త మాట్లాడుతూ ప్రముఖ పీఠధిపతులచే జూన్ 25వ తేదీన విగ్రహాల ప్రతిష్టలు జరుగుతాయని తెలిపారు.






## డిజిటల్ లైబ్రరీ సేవలు అందుబాటులోకి తేవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** గ్రంథాలయంలో పాఠకులకు డిజిటల్ లైబ్రరీ సేవలు తొందరగా అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. గ్రంథాలయంలోని పాఠకులను ప్రతి ఒక్కరిని అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాఠకులకు డిజిటల్ లైబ్రరీ సేవలు వీలైనంత తొందరగా అందుబాటులో తేవాలని ప్రణాళికా రూపొందించాలని సూచించినారు. వాటర్ ప్లాంట్ కొత్తది ఏర్పాటు చేస్తానన్నారు. ఎన్ని శాఖ గ్రంథాలయాలు ఉన్నాయో తెలుసుకున్నారు. రామన్నపేట, వలిగొండ, ఆలేరు, తుర్కపల్లి, గ్రంథాలయాలను సందర్శించి వాటి మరమ్మత్తులకు చేపట్టుటకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం సుధీర్ శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు చిత్తశుద్ధి ప్రదర్శించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

**చిట్యాల ముద్ర :** యుద్ధం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో పాటు గ్యాస్ సరఫరా లో అనేక రకాల ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో మంగళవారం జరిగిన సిపిఎం గ్రామ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధ నివారణ చర్యలు చేపట్టవలసిన భారత దేశ ప్రధాని మోడీ, ట్రంప్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారం లో అవాకులు, చవాకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేరళ ప్రభుత్వం విద్య, వైద్యం, పేదరిక నిర్మూలనకు పెద్ద కృషి చేసి, దేశంలో నే ఆదర్శ పాలన అందిస్తుంటే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇండ్లు, ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. నెలికంటి నర్సింహా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, మల్లం మహేష్, మండల నాయకులు అరూరి శ్రీను, పంది నరేష్, సుర్కంటి మోహన్ రెడ్డి, అరూరి దుర్గయ్య, శంభయ్య పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
08.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**గుమ్మడికాయ**



విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందిస్తూ చల్లదనం కలిగిస్తుంది.



## ముఖ నిర్ధారణతో పెన్షన్ల గుర్తింపు

- మెదక్‌లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం : కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లాలో ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారి ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెదక్ పట్టణం ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైందని తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారి ఫేషియల్ నిర్ధారణ ప్రక్రియను యాప్ ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ రెండు రోజుల పాటు మెదక్ పట్టణంలోని 7, 20, 21, 22 వార్డుల్లో కొనసాగుతుందని వెల్లడించారు. వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి ప్రక్రియను చేపడతారని తెలిపారు. నిర్ధారణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. మరణించిన వారిని పెన్షన్ పథకం నుంచి తొలగించేందుకు, పెన్షన్ పొందుతున్న వారిని నిర్ధారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, సర్ఫ్ డైరెక్టర్ (సోషల్ సెక్యూరిటీ) గోపాల్, ప్రాజెక్టు మేనేజర్ గోవర్ధన్, టీజీ ఆన్లైన్ కృష్ణంరాజు, మృణాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సింధు రేణుక, స్థానిక సర్పంచ్, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మా లైబ్రరీ మాకు కావాల్సిందే..

- ఓల్డ్ లైబ్రరీ తరలింపు దారుణం
- జువైనల్ కోర్టుకు మరో భవనం ఏర్పాటు చేయాలి : నిరుద్యోగ యువత




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఉన్న ఓల్డ్ లైబ్రరీని తరలించడం దారుణమని, ఆ లైబ్రరీ తమకు కావాల్సిందేనని నిరుద్యోగ యువతి, యువకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓల్డ్ లైబ్రరీ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న లైబ్రరీని అక్కడి నుంచి తీసేయడం వల్ల చాలా మంది నిరుద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఉద్యోగాల కోసం ఆర్థికంగా వెనుకబడిన జాబ్ ఆస్పిరెంట్లు నూతన లైబ్రరీకి వెళ్లాలంటే వ్యయభారాన్ని భరించాల్సి వస్తుందన్నారు. తమతో పాటు సీనియర్ సిటిజన్లు కూడా ఓల్డ్ లైబ్రరీలో ఎన్నో ఏళ్లుగా పాఠకులుగా ఉన్నారన్నారు. లైబ్రరీ పట్టణ కేంద్రంలో ఉండడం వల్ల అందరికీ అనుకూలంగా ఉండేదని, కానీ అక్కడ జువైనల్ కోర్టు ఏర్పాటు చేయడం వల్ల తమలాంటి పేద విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, న్యాయ అధికారాలు నిరుద్యోగులపై కరుణించి ఓల్డ్ లైబ్రరీని అలాగే కొనసాగించి, జువైనల్ కోర్టుకు మరో భవనంలో ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

## జిన్నారం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

- కలెక్టర్ ప్రావీణ్యకు మెమోరాండం సమర్పించిన ప్రజాప్రతినిధులు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ చైర్మన్ కీర్తి జనార్ధన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిన్నారం నూతన మున్సిపాలిటీలో తీవ్ర నిధుల (బడ్జెట్) కొరత నెలకొనడంతో పలు సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించి వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. జిన్నారం మున్సిపల్ ప్రాంతం గ్రామీణ స్వరూపంలో ఉండటంతో అభివృద్ధిలో వెనుకబడి ఉందని, మున్సిపాలిటీలో సంపూర్ణ నిధులు లేక వర్కర్లకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని తెలిపారు. జిన్నారం మున్సి పల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. జిన్నారం మున్సిపల్ పరిధిలో పలుచోట్ల రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండటంతో బస్సులు సకాలంలో రాక విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ పలు అంశాలపై సానుకూలంగా స్పందించి జిన్నారం మున్సిపల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కీర్తి జనార్ధన్‌తో పాటు కౌన్సిలర్లు ప్రభాకర్ రెడ్డి, పావని పరమేశ్వర్ రెడ్డి, బెలి కృష్ణ, ఆది గీతా రామకృష్ణ, పూజారి ప్రమోద రాజు, శ్రీలత నాగరాజు, ఆశా దేవి, శంకరప్ప శిల్పా నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య దినోత్సవం: ఉత్సాహంగా 5కే రన్




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 5కే రన్ కార్యక్రమం మెడికల్ కాలేజీ నుంచి ఐబి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పలు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా మాత్రమే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సాధారణంగా 40-50 ఏళ్ల తర్వాతే ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుందని, కానీ ప్రస్తుత యువత ముందుగానే ఆరోగ్యంపై దృష్టి సారించడం శుభపరిణామమని అన్నారు. భవిష్యత్ తరాల కోసం వైద్యులు సరైన జీవనశైలిపై మార్గదర్శకాలు అందించాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించినట్లుగా సమతుల్య ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, మానసిక ప్రశాంతత ఆరోగ్యానికి ప్రధాన అంశాలన్నారు. యువత ఈ అంశాలను పాటించడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి శాస్త్రీయ దృక్పథంతో జీవించాలని, జీవనశైలిని మార్చుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. శాస్త్రసమ్మత జీవనశైలిని అనుసరించడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. రోజువారీ జీవితంలో ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలను తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. యువత ఆరోగ్య పరంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, డీఎస్పీ సత్తయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మెడికల్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## మెడ్ ఎక్స్‌పోతో మూఢనమ్మకాలపై అవగాహన

- శరీర భాగాలపై ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు
- పాఠశాల విద్యార్థుల సందర్శన

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులు మెడికల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆరోగ్య దినోత్సవం థీమ్ "టుగెదర్ ఫర్ హెల్త్ - స్టాండ్ విత్ సైన్స్"గా నిర్వహించారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల ఉన్న మూఢనమ్మకాలను తొలగించే లక్ష్యంతో వైద్య విద్యార్థులు రకరకాల మోడల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థులు మొత్తం 64 మోడల్స్ ఏర్పాటు చేశారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సీపీఆర్, అవయవ దానం, మానవ శరీరంలోని అవయవాల పనితీరు, గ్రహణం సమయంలో గర్భిణీలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ప్రజలు ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు.

**గర్భిణీలు పండిన బొప్పాయి తినొచ్చు**

గర్భిణీలు బొప్పాయి తినకూడదనే అపోహ కొందరిలో ఉంది. బాగా పండిన బొప్పాయి తీసుకోవడం ద్వారా ఫైబర్, విటమిన్ సి ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. బొప్పాయిలో విటమిన్ ఏ, సి ఉండడం వల్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పచ్చి బొప్పాయి కాయ తినడం వల్ల గర్భిణీలకు గర్భస్రావం జరిగే అవకాశం ఉండటంతో పచ్చి కాయ తినకూడదని సూచించారు.

**గ్రహణ సమయంలో అపోహలను వదలండి**

గ్రహణ సమయంలో చాలా మంది ఆహారం తినకూడదు, బయట తిరగకూడదనే మూఢ నమ్మకాలు, అపోహలు పాటిస్తుంటారు. కానీ సూర్యగ్రహణం సమయంలో కిరణాల తీవ్రత వల్ల ఎక్కువసేపు నేరుగా చూడడం కంటిచూపుకు హానికరమన్నారు. సోలార్ ఫిల్టర్ గ్లాసెస్ వినియోగించాలని సూచించారు. గర్భిణీలు రాత్రి సమయంలో స్నానం చేయకూడదనేది కూడా అపోహ మాత్రమేనని వైద్య విద్యార్థులు చార్ట్స్ ద్వారా అవగాహన కల్పించారు. పలు ఆరోగ్య అంశాలపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ కళాశాల సైకియాట్రీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి, పుల్మనాలజీ విభాగ డాక్టర్ వేణు, డాక్టర్ మాధవ్, డాక్టర్ సదానందం ఎగ్జిబిషన్‌లో స్టాళ్లను పరిశీలించి ఉత్తమ స్టాళ్లను ఎంపిక చేసి అభినందించారు.




## ఫుడ్ సేఫ్టీ బృందానికి రాష్ట్ర స్థాయి ప్రశంస పత్రం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య సేవల అందింపులో ఉత్తమ పనితీరు కనబర్చినందుకు సంగారెడ్డి ఫుడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు టాస్క్ బృందానికి గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ నుంచి ప్రశంస పత్రం లభించింది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 7, 2026న ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంత్రి దామోదర్ రాజనరసింహ ఈ సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించడంలో, నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంలో, అక్రమాలను అరికట్టడంలో సంగారెడ్డి బృందం చూపిన చురుకుదనం రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో మరింత కట్టుదిట్టంగా తనిఖీలు నిర్వహించి నాణ్యమైన ఆహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రైతుల కోసం సింగూర్ నీరు విడుదల చేయాలి

- హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన పద్మ దేవేందర్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



మెదక్ జిల్లా రైతులకు సింగూర్ ప్రాజెక్ట్ నుంచి సాగునీరు అందించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి రైతులతో కలిసి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్‌సీ) కమిషనర్‌ను ఆశ్రయించారు. సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పదేళ్ల పాటు రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామన్నారు. సింగూర్ జలాలను మెదక్ జిల్లాకు అంకితం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తీసుకున్న చర్యల వల్ల మెదక్ జిల్లాలో వ్యవసాయం అభివృద్ధి చెందిందని, సింగూర్ నీటి వినియోగంతో వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయని వివరించారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గణపూర్ ఆయకట్టు పరిధిలో పంటలు వేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉండగా, నీటి కొరత కారణంగా ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చే కీలక సమయంలో కనీసం ఒక తడి నీరు అందిస్తే పంట బతికే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెండు రోజుల్లోపు నీటి విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి, కొడుపాక సర్పంచ్ కాశినాథ్ రావు, ఎంకేపల్లి మాజీ సర్పంచ్ బద్రి మల్లేశం, కొడుపాక, ఎంకేపల్లి, నాగ్సాన్‌పల్లి, గాజులగూడెం, చిత్రియల్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**హెచ్‌ఆర్‌సీ సానుకూల స్పందన**

హెచ్‌ఆర్‌సీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సింగూర్ నుంచి రైతులకు నీరు విడుదలయ్యేలా సంబంధిత అధికారులతో చర్చించి సిఫారసులు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ విషయంపై స్పష్టమైన సమాచారం అందిస్తానని కమిషనర్ తెలిపారు.

**నీటి విడుదల కోసం హెచ్‌ఆర్సీ ఆదేశం**

సింగూరు ప్రాజెక్టు నుండి వనదుర్గ ప్రాజెక్టు (ఘన్‌పూర్ ఆనికట్)కు 0.30 టీఎంసీ నీటిని తుది విడతగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర మానవ హక్కుల సంఘం కమిషనర్ సిఫార్సు చేశారు. నీటి విడుదలకు సంబంధించి అధికారులను ఆదేశించవలసిందిగా సూచిస్తూ ఆదేశాలిచ్చారు.

## సామాజిక ఉద్యమాలకు అండగా సీఐటీయూ

- విరాళాల సేకరణకు పిలుపు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

సామాజిక ఉద్యమకారుల జయంతుల సందర్భంగా సామాజిక ఉద్యమ నిధి సేకరణలో కార్మిక వర్గం భాగస్వామ్యం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో మల్లేశం మాట్లాడుతూ దేశంలో నేటికీ కుల వివక్ష అనేక రూపాల్లో కొనసాగుతుందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుల వివక్షను సమర్థిస్తూ అగ్రవర్ణాలకు అండగా నిలుస్తూ దళితులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేసిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. బాలమణి, కోశాధికారి నరసమ్మ, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కె. నాగరాజు, సహాయ కార్యదర్శి జె. సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు లహరి, పుష్ప, బాలేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా బేతాళ స్వామి ఎడ్లబండ్ల ప్రదక్షిణ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మెదక్ జిల్లాలోని ఏడుపాయల జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఈ ఉత్సవాలు భక్తి వైభవంతో కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఐదవ రోజు ప్రధాన ఘట్టమైన ఎడ్లబండ్ల ప్రదక్షిణ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు ఎడ్లబండ్లను పోటాపోటీగా సుందరంగా అలంకరించి డప్పు వాయిద్యాలు, ఆటపాటలతో గ్రామ వీధుల గుండా స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు "గోవిందా.. గోవిందా" అంటూ భక్తి పారవశ్యంతో స్వామిని స్మరించుకుంటూ వివిధ రకాల ఆటపాటలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ పలు ఏర్పాట్లు చేసింది. సీఐ రేణుక రెడ్డి, ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
08.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సొరకాయ**
చల్లదనాన్ని ఇస్తుంది, నీరసం తగ్గిస్తుంది. హృదయానికి మరియు జీర్ణానికి సహాయపడుతుంది.



## శ్రీవారి హుండీలో రూ.400 కోట్ల రద్దయిన నోట్లు

- **కానుకలుగా రూ.500, రూ.1000 నోట్లు**
- **హుండీల లెక్కింపులో వెలుగులోకి**

**ముద్ర డెస్క్ :**
టీటీడీలో భక్తులు సమర్పిస్తున్న రద్దయిన నోట్ల నిల్వలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రూ.500, రూ.1000 నోట్లు దాదాపు రూ.400 కోట్లు టీటీడీ వద్దనే ఉన్నట్టు తెలుస్తోంది. డీమానిటైజేషన్‌లో భాగంగా కేంద్రం ఈ నోట్లను రద్దు చేసినప్పటికీ, స్వామివారి హుండీలో ఇవి కానుకలుగా వస్తూనే ఉన్నాయి. వాటి మార్పిడి కోసం టీటీడీ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. స్వయంగా టీటీడీ చైర్మన్లు, అధికారులు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేసినా సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది. ఇక రూ.2 వేల నోట్లు రద్దు చేసినప్పటికీ, ప్రతి నెలా రూ.30 కోట్ల నుంచి రూ.35 కోట్లు హుండీ ద్వారా వస్తున్నాయి. అయితే వీటిని బ్యాంకుల సహకారంతో రెండు నెలలకు ఒకసారి టీటీడీ మార్పిడి చేసుకుంటోంది.

## భారత ఆర్మీ చేతికి 10 కోట్ల ఆత్మాహుతి డ్రోన్లు





- **పాకిస్తాన్ వెన్నులో వణుకే.. యుద్ధం మొదలైతే ఖతమే**

**ముద్ర డెస్క్ :**
ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసింది. అయితే మారుతున్న యుద్ధ రీతులతో భారత్ కూడా సరికొత్త ఆయుధాల సమకూర్చుకోవాల్సిన అవశ్యకత ఏర్పడింది. విదేశాల నుంచి కొనుగోలు చేయడం కన్నా సొంతంగా తయారు చేయడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఈ క్రమంలో మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహిస్తోంది. అత్మనిర్భర్‌వైపు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో గుజరాత్‌కు చెందిన స్టార్టప్ ఓ అద్భుతం చేసింది. సూరత్‌కు చెందిన డ్రోన్ తయారీదారు ఇన్‌సైడ్‌ఎఫ్‌పీవీ భారత సైన్యానికి రూ.10 కోట్ల విలువైన కమికాజీ (సుసైడ్) డ్రోన్లను కేవలం 60 రోజుల్లో సరఫరా చేసింది. రక్షణ రంగంలో కొత్త చరిత్ర సృష్టించింది. డిసెంబర్ 2025లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, ఈ డ్రోన్లను ఉత్తర కమాండ్‌కు పంపించారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ రూట్ కింద ఈ ఆర్డర్ ఇచ్చింది. సాధారణంగా 6-12 నెలలు పట్టే ప్రక్రియను 2 నెలల్లో పూర్తి చేయడం గమనార్హం.

**కమికాజీ డ్రోన్ల ప్రత్యేకతలు ఇవీ..**
ఈ డ్రోన్లు సాధారణ డ్రోన్లలా కాకుండా, లక్ష్యం వద్ద తాము కూడా పేలిపోయేలా రూపొందించబడ్డాయి. శత్రువు జామ్ చేసినా, సిగ్నల్ లేకపోయినా స్వయంప్రతిపత్తితో లక్ష్యాన్ని చేరుకుంటాయి. -35 డిగ్రీల ఉష్ణోగ్రతల నుంచి 50 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలోనూ ఇవి పనిచేస్తాయి. ముందే నిర్దేశించిన మార్గంలో స్వయంప్రతిపత్తితో ఎగురుతాయి. పొరపాటున పేలకుండా అనేక భద్రతా పొరలు ఉంటాయి. లక్ష్యం చేరుకున్న తర్వాత మాత్రమే పేలుతాయి. ఈ డ్రోన్లు ఉత్తర సరిహద్దులో (లడఖ్, జమ్మూ-కాశ్మీర్) మోహరించడానికి అనుకూలం. పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో జీపీఎస్ జామింగ్ సాధారణం. అలాంటి పరిస్థితుల్లో కూడా ఇవి విఫలం కావు.

**మేక్ ఇన్ ఇండియా'కు నిదర్శనం..**
ఈ డ్రోన్లలో 90 శాతం భాగాలు భారత్‌లోనే తయారయ్యాయి. మోటార్లు, బ్యాటరీలు, ఫ్లైట్ కంట్రోలర్లు, కెమెరాలు అన్నీ దేశీయ సప్లయర్ల నుంచి సమకూరాయి. ఇది ప్రధాని నరేంద్ర మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఉంది. గతంలో ఇజ్రాయెల్, అమెరికా నుంచి డ్రోన్లు దిగుమతి చేసుకునేవారు. ఇప్పుడు భారత్ స్వంతంగా తయారు చేసి, సరఫరా చేస్తోంది. సంస్థ సీఈవో అర్థ చౌదరి మాట్లాడుతూ, 'మా డ్రోన్లు భారత్ కఠినమైన వాతావరణానికి అనుగుణంగా రూపొందించబడ్డాయి. 60 రోజుల్లో ఆర్డర్ పూర్తి చేయడం మా సామర్థ్యానికి నిదర్శనం' అని అన్నారు.

**ఉత్పత్తి సామర్థ్యం పెంపు..**
పెరుగుతున్న డిమాండ్‌ను చేపట్టడానికి సంస్థ తన తయారీని 20,000 చ.అడుగుల పెద్ద ఫ్యాక్టరీకి మారుస్తోంది. ఇక్కడ నుంచి నెలకు 500లకుపైగా డ్రోన్లు తయారు చేయగలరు. పెద్ద ఒప్పందాలు స్వీకరించగలదు. పరిశోధన అభివృద్ధి కోసం ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు.
భారత కమికాజీ డ్రోన్ మార్కెట్ 2027 నాటికి రూ.5 వేల కోట్లకు చేరుకుంటుందని అంచనా. సైన్యం 850 డ్రోన్ల కొనుగోలుకు రూ.2 వేల కోట్ల ప్రతిపాదన సిద్ధం చేసింది. ఇన్‌సైడ్‌ఎఫ్‌పీవీ వంటి సంస్థలు ఈ మార్కెట్‌లో 30 శాతం వాటా సాధించే అవకాశం ఉంది.

## ట్రంప్ హెచ్చరికలు.. ఇరాన్‌లోని భారతీయులకు ఎంఈఏ అడ్వైజరీ

**ముద్ర డెస్క్ :**
ఈ రాత్రి ఇరాన్‌పై భారీ దాడులు చేపట్టనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారతీయులకు కేంద్ర విదేశాంగ శాఖ (ఎంఈఏ) అడ్వైజరీ జారీ చేసింది. తాజా పరిణామాల దృష్ట్యా ఎక్కడివారు అక్కడే ఉండాలని.. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లలోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రాయబార కార్యాలయ అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని కోరింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా భారత పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు ఎవరూ ఎక్కడికీ వెళ్లొద్దని..సురక్షిత ప్రాంతాల్లో తల దాచుకోవాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో ఒకవేళ హైవేలపై ప్రయాణించాలనుకుంటే రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని పేర్కొంది. తాము ఏర్పాటు చేసిన హోటళ్లలో ఉన్నవారు.. అక్కడే ఉన్న ఎంబసీ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, అక్కడే పరిమితం కావాలని సూచించింది. ఏదైనా అత్యవసరమైతే ఈ మెయిల్ cons.tehran@mea.gov.inలో కూడా సంప్రదించవచ్చని సూచించింది



# ఫ్యూచర్ సిటీ దారి వివాదం

- **గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణపై హైకోర్టు సీరియస్**
- **సర్కార్‌కు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూసేకరణ అంశంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భూసేకరణ చట్టం-2013 నిబంధనలు పాటించలేదని, తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదని కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన కోర్టు ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. కాగా, రైతులకు పరిహారం చెల్లించే వరకు పిటిషనర్ల భూములను స్వాధీనం చేసుకోబోమని అడ్వకేట్ జనరల్ కోర్టుకు హామీ ఇచ్చారు. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా ఆకుతోటపల్లి వరకు ఈ రోడ్డును ప్రతిపాదించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన విషయం




తెలిసిందే. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగ్ రోడ్ వరకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఈ కొత్త రహదారి నిర్మాణం చుట్టూ న్యాయ వివాదాలు ముసురుకుంటున్నాయి. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం (ఏప్రిల్ 6) తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్డు నిర్మాణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారంటూ 30 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ యాచారం మండలం కుర్మిద్ద, కడ్తాల్ మండలం కడ్తాల్, ముద్విన్, ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామాల్లో మొత్తం 554.34 ఎకరాల సేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. అయితే భూసేకరణ, పునరావాసం చట్టం-2013లో పేర్కొన్న తప్పనిసరి నిబంధనలను అధికారులు తుంగలో తొక్కారని వారు ఆరోపించారు. ముఖ్యంగా నిర్వాసిత రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించాల్సి ఉండగా, ఆ ప్రక్రియను మొక్కుబడిగా పూర్తి చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. తమ అభ్యంతరాలను అకారణంగా తిరస్కరించారని, ఇది చట్ట విరుద్ధమని, ఏకపక్షమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 61.24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ భూముల నుంచి తమను బలవంతంగా ఖాళీ చేయించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్, వాస్తవ పరిస్థితులపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ మొత్తం 554.34 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల భూమి వివాదంలో ఉందని, మిగిలిన భూమికి సంబంధించి 26 ఎకరాలకు ఇప్పటికే పరిహారం అవార్డులు జారీ చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా భూసేకరణపై స్టే ఇవ్వవద్దని ఆయన కోర్టును కోరారు. అలాగే రైతులకు పరిహారం చెల్లించే వరకు వారిని భూముల నుంచి ఖాళీ చేయించబోమని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. ఈ హామీని పరిగణనలోకి తీసుకున్న కోర్టు తదుపరి విచారణను సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

# ఉపాధి హామీ పథకాన్ని తొలగించే కుట్ర

- **పని దినాలను సగానికి తగ్గించి పేదల పొట్ట కొడుతున్నారు**
- **జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కేంద్రంలోని మోడీ సర్కార్ దేశంలో ఉపాధి హామీ పథకాన్ని తొలగించే కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలపై కక్ష గట్టినట్లుగా వ్యవహరిస్తూ వారి నోటికాడి కూడు లాగేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి పని దినాలు తగ్గించడం, నిధులు ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. పేదలకు మేలు చేసే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ పథకాన్ని పథకం ప్రకారం తొలగించే కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి చట్టబద్ధత లేకుండా చేశారని విమర్శించారు. భవిష్యత్తులో



ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినా అడిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కోవిడ్ తర్వాత 2021-22లో 14 కోట్ల పని దినాలు ఉంటే, గతేడాది 7 కోట్లకు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో పని దినాలు కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే వారు ప్రజల కోసం ఏం చేస్తున్నారని కవిత ప్రశ్నించారు. పేద ప్రజల నోటికాడి కూడు లాగేస్తుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అన్యాయమన్నారు. కరువు కాలంలో గ్రామాల్లో పేదలను ఆదుకున్న ఈ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

# తమిళనాడు ఎన్నికల్లో తెలంగాణ నేతలు

- **స్టార్ క్యాంపెయినర్లుగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్**
- **ఉత్తర్వులు జారీ చేసిన అధిష్టానం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ఏఐసీసీ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతోంది. ఈమేరకు అక్కడి ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులను ప్రచార రంగంలోకి దించింది. తమిళనాడులో డీఎంకేతో పొత్తులో భాగంగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను 'స్టార్ కంపెయినర్లు'గా నియమిస్తూ అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, పార్టీ వ్యూహరచనలో కీలకమైన బాధ్యతలను కూడా ఏఐసీసీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అప్పగించింది. ఆయన తమిళనాడులో కాంగ్రెస్ పోటీ



చేస్తున్న మొత్తం 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 12 నియోజకవర్గాలకు సీనియర్ పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, బూత్ స్థాయి పర్యవేక్షణ వంటి కీలక అంశాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇదిలావుంటే.. ఈ నెల 23న తమిళనాడు అసెంబ్లీకి పోలింగ్ జరగనుంది. డీఎంకేకాంగ్రెస్ కూటమి ఈ ఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిల నాయకత్వ పటిమ, తమిళనాడు ఎన్నికల్లోనూ కూటమికి కలిసి వస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నాయకుల రాకతో తమిళనాడులో కాంగ్రెస్ ప్రచారంలో జోరు పెరగడమే కాకుండా, కార్యకర్తల్లో నూతనోత్సాహం నిండుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## గాంధీనగర్ పోలీసులు వేధిస్తున్నారని..మహిళా ఆత్మహత్యాయత్నం

- **హెచ్ఆర్సీ ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం**

**ముద్ర, నాంపల్లి :**
హైదరాబాద్ లోని నాంపల్లిలో ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఎదుట ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. మంగళవారం కమిషన్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటుండగా పోలీసులు అడ్డుకున్నారు. కవాడిగూడలో శ్రావణి అనే మహిళ తన కుటుంబంతో కలిసి నివసిస్తోంది. గాంధీనగర్ పోలీసులు తనని వేధిస్తున్నారని కమిషన్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని సదరు మహిళ ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకొని పెట్రోల్ బాటిల్ ను లాక్కున్నారు .సదరు మహిళను కమిషన్ చైర్మన్ వద్దకు హెచ్ ఆర్ సి సిబ్బంది తీసుకెళ్లారు. అక్కడ మహిళా ఫిర్యాదును స్వీకరించిన ఛైర్మన్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది.



## ఏసీబీ వలలో అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అక్రమ ఆస్తులు గుర్తించారు.

## పాకిస్థాన్‌లో లాక్‌డౌన్

- **ఇంధన కొరతతో కుదేలైన పాక్**

**ముద్ర డెస్క్ :**
పాకిస్థాన్‌లో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. ఇప్పటికే విదేశీ మారక ద్రవ్య కొరతతో ఇబ్బందులు పడుతున్న ఆ దేశం, ఇప్పుడు ఇంధన సంక్షోభాన్ని కూడా ఎదుర్కొంటోంది. మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధ ప్రభావంతో ఇంధన సరఫరా దెబ్బతినడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం "స్మార్ట్ లాక్‌డౌన్" విధానాన్ని అమలు చేసింది. దేశంలోని పంజాబ్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, బలూచిస్థాన్, ఇస్లామాబాద్ వంటి ప్రాంతాల్లో షాపింగ్ మాల్‌స్‌ను రాత్రి 8 గంటలకే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే రెస్టారెంట్లు, బేకరీలు రాత్రి 10 గంటల తర్వాత పనిచేయకూడదని నిర్ణయించింది. ఇక మరోవైపు విదేశీ అప్పుల ఒత్తిడి కూడా పెరుగుతోంది. యూఏఈ ఇచ్చిన భారీ రుణాన్ని తిరిగి చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి మరింత దెబ్బతింది. ఇంధన ధరలు పెరగడం, పన్నులు అధికంగా ఉండడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం మీద పాకిస్థాన్ పరిస్థితి అత్యంత సంక్షోభంగా మారింది. ప్రభుత్వం పొదుపు చర్యలు చేపడుతున్నప్పటికీ, దీర్ఘకాలిక పరిష్కారం లేకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టమాట**
విటమిన్ C ఎక్కువగా ఉండి దాహాన్ని తగ్గిస్తుంది. చర్మాన్ని కాపాడటంలో సహాయపడుతుంది.

## మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ



- **డీజీపీ శివధర్ రెడ్డి**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఇది సాధ్యం**
- **తెలంగాణకు చెందిన ఆరుగురు మావోయిస్టులు మన రాష్ట్రంలో లేరు**
- **తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ.. మావోయిస్టు రహిత రాష్ట్రంగా అవతరించిందని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని ప్రకటించారు. నక్సలిజాన్ని రూపు మాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఇంకా ఆరుగురు మావోయిస్టులు ఉన్నారన్న ఆయన ప్రస్తుతం వారు మన రాష్ట్రంలో లేరని అన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా పోలీసులకు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని సూచించారు. మంగళవారం తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టలోని పామూనూరు బేస్ క్యాంప్ సమీపంలో పోలీస్ ఔట్ పోస్టును, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మొరుమూరు నుంచి పామూనూరు వరకు దట్టమైన అడవుల్లో రోడ్డు నిర్మాణం చేశామని, డోలి, జెల్లా, చలిమెల గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల అభివృద్ధి ధ్యేయంగా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పామూనూరు గ్రామస్థులకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడేందుకు ఆటో, ద్విచక్ర వాహనాన్ని అందించామని తెలిపారు. గ్రామస్థులకు హెల్మెట్లను అందజేసి, అరైవ్ అలైవ్ అనే కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్వో సువర్ణ, ఇంటెలిజెన్స్ ఐజీ విజయ్ కుమార్ సీఆర్పీఎఫ్ ఐజీ విక్రమ్, ఎస్టి ఐజీ సుమతి, ఎస్పీ సుధీర్ రామ్ నాద్ కేకన్. డీఎఫ్వో రాహుల్ కిషన్ జాదవ్ సీఐ ముత్యం రమేష్ ఎస్ఐ తిరుపతి రావు కృష్ణ ప్రసాద్, సతీష్,కన్నాయిగూడెం ఏటూరునాగారం మంగపేట ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.






## జేఎన్టీయూలో బాంబు కలకలం

- **ఈమెయిల్ ద్వారా వీసీకి బెదిరింపు**

**ముద్ర కూకట్‌పల్లి :**

నగరంలోని ప్రసిద్ధ విద్యాసంస్థ కూకట్‌పల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ)లో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం సృష్టించింది. మంగళవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఒక ఈమెయిల్ వచ్చింది. ఆ మెయిల్‌లో వర్సిటీ ప్రాంగణంలో బాంబు అమర్చినట్లు హెచ్చరిక ఉండటంతో యాజమాన్యం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బాంబు బెదిరింపు సమాచారం అందిన వెంటనే అప్రమత్తమైన వర్సిటీ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సైబరాబాద్ పోలీసులు, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి హుటాహుటిన క్యాంపస్‌కు చేరుకున్నారు. పోలీసు బృందాలు విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని విభాగాలు, తరగతి గదులు, పరిపాలనా భవనం, హాస్టల్ ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. ముందస్తు జాగ్రత్తగా విద్యార్థులను, సిబ్బందిని భవనాల నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాము ఈమెయిల్ మూలాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని, ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.


**ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు**

పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. క్యాంపస్ వెలుపల భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు సమాచారం తెలుసుకోవడానికి ఆతురత ప్రదర్శించారు. ప్రస్తుతం జేఎన్టీయూ పరిసరాల్లో భారీ పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. ఇది కేవలం ఆకతాయిల పనా లేదా దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పూర్తి వివరాలు గాలింపు ముగిసిన తర్వాత తెలిసే అవకాశం ఉంది.

# కర్రెగుట్టలపై సర్కార్ భారీ స్కెచ్

- **పోలీస్ బాస్ వెళ్తోంది అందుకే**

**ముద్ర, డెస్క్:**




మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న కర్రె గుట్టలపై తెలంగాణ సర్కార్ భారీ స్కెచ్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. పోలీస్ అవుట్ బేస్ నిర్మించాలనే ఆలోచన అందులో భాగమని భావిస్తున్నారు. విస్తారమైన అడవులతో దుర్భేద్యమైన ఈ ప్రాతంలో ఆపరేషన్ కగార్ లో భాగంగా కేంద్ర బలగాలు గత ఏడాది మకాం వేసి, మావోయిస్టులను అత్యంత శక్తివంతమైన ఆయుధాలతో తుద ముట్టించాయి. ఈ ఆపరేషన్‌తో కొందరు మావోయిస్టులు చనిపోతే, మిగతా వారు లొంగిపోయారు.

కర్రెగుట్టల ప్రాంతంలో పోలీస్ బేస్ క్యాంపు నిర్మిస్తే వామపక్ష ఉద్యమాల ప్రభావాన్ని అణిచి వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్లే కేంద్రం సహకారంతో ఇక్కడ బేస్ క్యాంపు నిర్మిస్తోంది. డీజీపీ శివధర్ రెడ్డి కొద్దిరోజులుగా ఇక్కడి అధికారులతో మాట్లాడుతూ, పరిస్థితుల గురించి వాకబు చేస్తున్నారు. మంగళవారం భూమిపూజ కార్యక్రమం తర్వాత డీజీపీ రోడ్డు పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత స్థానికంగా ఉన్న గిరిజనులతో మమేకం అవుతారు. అనంతరం ఇక్కడ శాంతి భద్రతలు, ఇతర వ్యవహారాల గురించి స్థానిక పోలీసులను అడిగి తెలుసుకుంటారు. తెలంగాణ, చత్తీస్ గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రె గుట్టలు, పామూనురు ప్రాంతాలలో పోలీస్ అవుట్ పోస్ట్ నిర్మించనున్నారు. ములుగు ఎస్పీ రామనాథ్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఇప్పటికే పోలీసులు ఆదీనంలోకి తీసుకున్నారు. ఈ గుట్టల ప్రాంతంలోని జెల్లా, డోలి, తడపల ప్రాంతాలకు రహదారులను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలను కొద్దిరోజుల క్రితం ప్రారంభించారు. గతంలో ఈ ప్రాంతాలకు రోడ్లు ఉండేవి కావు. ఆపరేషన్ కగార్ తర్వాత ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది. దీనికి తోడు గిరిజన గ్రామాలలో ఉన్న ప్రజలను పోలీసులు జాగృతం చేశారు. వామపక్ష ఉద్యమాలకు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు వారికి ఉపాధి కల్పించారు. యువతకు చదువు మీద అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ సోలార్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో ఇక్కడి యువత చదువు బాట పట్టింది. ప్రస్తుతం తమ ప్రాంతంలో ఉన్న గిరిజనులు స్వయం ఉపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు. కొందరు సోలార్ మోటార్ల ద్వారా వ్యవసాయం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో ఇక్కడ రోడ్డు పనులు పూర్తయితే, ములుగు, భూపాలపల్లి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు రాకపోకలకు మార్గం సుగమమవుతుంది.

## ప్రభుత్వ కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో అమలు చేయాలి

- **పాఠ్యాంశాలు నవీకరణ.. కాలేజీ విద్య రీ-ఓరియెంటేషన్**
- **ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి**
- **సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **అవేర్ 2.0 మొబైల్ యాప్ లాంచ్ చేసిన ముఖ్యమంత్రి**

**ముద్ర, అమరావతి:-**



ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయాలన్నారు. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో ఉండాలన్నారు. వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని అన్నారు. యూనివర్సిటీలతో నిత్యం అనుసంధానం అవుతూ ట్రెడిషన్ కోర్సులతో పాటు, డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలన్నారు. ఉన్నత విద్యా మండలి కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలన్నారు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలని, 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలి. వేలాడుతున్న విద్యుత్, కేబుల్ తీగల వల్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్ వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్ 2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఇది ఒక చారిత్రాత్మక విజయ క్షణం

- **నందమూరి బాలకృష్ణ**
- **కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదలపై హర్షం**

**ముద్ర, అమరావతి:**

కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసి, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదంతో అమరావతిని ఏకైక రాజధానిగా అధికారికంగా ప్రకటించడంపై నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఇది మన రైతుల త్యాగానికి, ప్రజల ఆశలకు, భవిష్యత్తు తరాల కలలకు లభించిన న్యాయమన్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక నగరం కాదని, తమ ఆత్మగౌరవానికి, తమ భవిష్యత్తుకు ప్రతీక అని అన్నారు. ఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా రాజధాని చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడంలో సహకరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు, పార్లమెంట్ సభ్యులందరికీ, తమ వెన్నంటి నిలిచిన ఆంధ్రప్రదేశ్ పౌరులకు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు అని తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయమని, ముఖ్యంగా అమరావతి రైతుల విజయమని అన్నారు.

వారి సహనం, త్యాగం, నిబద్ధతే ఈ చారిత్రాత్మక క్షణానికి పునాది అని, వారికి శుభాకాంక్షలు అని అన్నారు. ఈ చట్టబద్ధతతో పెట్టుబడిదారులకు భరోసా కలుగుతుందని, అమరావతి అజేయంగా, అజరామరంగా వెలుగొందుతుందని అన్నారు. మనందరం కలసి అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదామని అన్నారు.

## ఎంపీ నిధులలో సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- **దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల పంపిణీ**
- **ఎంపీ డాక్టర్ మల్లు రవి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



తన ఎంపీ నిధులను సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రాధాన్యతగా వినియోగిస్తానని ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీ ల్యాండ్స్ నిధుల ద్వారా దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. మొత్తం 9 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల 31 వేల వ్యయంతో ఈ ట్రైసైకిళ్లు అందజేశారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారులకు ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రధానమైన అంశమని, సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం ఎంతో అవసరమన్నారు. దివ్యాంగులు దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు వంటి సహాయక పరికరాలు వారి స్వతంత్ర జీవనానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పరికరాల ద్వారా దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతారని ఆయన విశ్వసించారు. కార్యక్రమంలో జిల్లా డీడబ్ల్యూవో రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లల మెరుగైన భవిష్యత్‌కు పటిష్టమైన ప్రణాళిక

- **తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీత దయాకర్**

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:**


జవహర్ నగర్ లోని పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించేందుకు అధికారులు పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీత దయాకర్ సూచించారు . మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మను చౌదరితో కలిసి చైర్మన్ సీత దయాకర్ సమీక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు చందన, సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ అన్ని శాఖలు తమ తమ విధులను అంకితభావంతో పని చేయడమే కాకుండా, ఆ పిల్లలు, మన పిల్లలే అనే ఆలోచనతో చేస్తే తప్పకుండా ఈ సమస్యను పరిష్కరించగలమన్నారు. అక్కడ ఉంటున్న పిల్లల వివరాలను సేకరించి వారిలో డ్రాప్‌అవుట్స్ వివరాలను అందించాలని సూచించారు. అలాగే అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఆధార్, బర్త్, కాస్ట్ సర్టిఫికేట్లు లేని వారు చాలా మంది ఉన్నారని, వారికోసం అక్కడే ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి అందించాలని కీసర ఆర్డీవోను కోరారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్, డ్రాపౌట్ వంటి అనేక సమస్యలు అక్కడ ఉన్నాయని జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధతో ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## రూ. 25 కోట్ల ప్లేయర్.. ఈ ఆటేంది?



కేకేఆర్ ప్లేయర్ కామెరాన్ గ్రీన్ పై విమర్శలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** ఐపీఎల్ 2026 మినీ వేలంలో భారీ ధరకు కొనుగోలు చేసిన కామెరాన్ గ్రీన్ ప్రదర్శనపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ. 25.20 కోట్ల భారీ మొత్తంతో కేకేఆర్ జట్టు అతన్ని దక్కించుకున్నప్పటికీ, మైదానంలో మాత్రం ఆ స్థాయిలో ప్రభావం చూపించలేకపోతున్నాడు. ఈ సీజన్‌లో గ్రీన్ మూడు మ్యాచ్‌లు ఆడినా, ఒక్క మ్యాచ్‌లో కూడా ఆశించిన స్కోర్ చేయలేదు. మొదటి మ్యాచ్‌లో 18 పరుగులు చేసిన అతను, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లకే పరిమితమయ్యాడు. దీంతో అతని బ్యాటింగ్ ఫామ్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో గ్రీన్ బౌలింగ్ చేయకపోవడం కూడా జట్టుకు మైనస్‌గా మారింది. గాయం కారణంగా అతనికి బౌలింగ్ చేయొద్దని సూచనలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అతను పూర్తి స్థాయి ఆల్‌రౌండర్‌గా ఉపయోగపడలేకపోతున్నాడు. ఈ పరిస్థితుల్లో భారీ ధరకు తీసుకున్న గ్రీన్‌పై కేకేఆర్ అభిమానులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. రాబోయే మ్యాచ్‌ల్లో అతను ఫామ్‌లోకి రావడం జట్టుకు ఎంతో కీలకంగా మారింది.

## రూ. 2,400 కోట్ల నష్టం.. బీసీసీఐపై లలిత్ మోదీ విమర్శలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** ఐపీఎల్ ప్రస్తుత ఫార్మాట్‌పై మాజీ కమిషనర్ లలిత్ మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు ఒప్పందం ప్రకారం హోమ్‌అవే విధానాన్ని అమలు చేయకపోవడం వల్ల లీగ్ సుమారు రూ. 2,400 కోట్ల అదనపు ఆదాయాన్ని కోల్పోతుందని ఆయన పేర్కొన్నారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు భారీ విలువకు విక్రయించబడిన నేపథ్యంలో ఐపీఎల్ స్థాయి పెరిగిందని మోదీ అభిప్రాయపడ్డారు. అయితే, అదే సమయంలో ప్రస్తుత ఫార్మాట్ వల్ల జట్లు మరియు బీసీసీఐ ఆర్థికంగా నష్టపోతున్నాయని అన్నారు. మోదీ వివరించిన ప్రకారం, ప్రతి జట్టు



మిగతా జట్లతో రెండుసార్లు ఆడేలా హోమ్‌అవే విధానం ఉండాలి. 10 జట్లు ఉన్న ప్రస్తుత పరిస్థితిలో లీగ్ దశలో 90 మ్యాచ్‌లు, అదనంగా నాకౌట్ మ్యాచ్‌లు కలిపి మొత్తం 94 మ్యాచ్‌లు జరగాలి. కానీ ప్రస్తుతం కేవలం 74 మ్యాచ్‌లతోనే టోర్నమెంట్ కొనసాగుతోంది. ప్రతి మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయంలో సగం బీసీసీఐకి, మిగతా సగం జట్లకు వెళ్తుంది. మ్యాచ్‌ల సంఖ్య తగ్గడంతో జట్లు సుమారు 20 మ్యాచ్‌ల ఆదాయాన్ని కోల్పోతున్నాయని మోదీ తెలిపారు. జట్లు చెల్లిస్తున్న ఫీజులకు అనుగుణంగా హోమ్‌అవే మ్యాచ్‌లు ఇవ్వడం ఒప్పందపరమైన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక్కో మ్యాచ్‌కు సుమారు రూ. 118 కోట్ల మీడియా హక్కుల విలువ ఉన్న నేపథ్యంలో, పూర్తి స్థాయి ఫార్మాట్ అమలు చేస్తే అదనంగా రూ. 2,400 కోట్ల ఆదాయం వచ్చేదని మోదీ వివరించారు. అందులో రూ. 1,200 కోట్లు జట్లకు వెళ్లి, ఒక్కో జట్టుకు సుమారు రూ. 120 కోట్లు లభించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. క్యాలెండర్‌లో సమయం లేకపోతే జట్ల సంఖ్య పెంచకూడదని, కానీ అసలు ఒప్పందాన్ని మార్చడం సరైంది కాదని మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితి లీగ్ విలువపై కూడా ప్రభావం చూపుతోందని ఆయన హెచ్చరించారు.



## ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ ఎదురుదెబ్బ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు కీలక షాక్ తగిలింది. జట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ మరికొంతకాలం అందుబాటులో ఉండకపోవడం పెద్ద నష్టంగా మారింది. భుజం, మోచేతి గాయాలతో బాధపడుతున్న స్టార్క్ కనీసం మరో మూడు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశమున్నట్లు సమాచారం. దీంతో ఏప్రిల్ మధ్య వరకు అతను జట్టుతో కలిసే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం ఢిల్లీ పేస్ బౌలింగ్ బాధ్యతలను ముఖేష్ కుమార్, టి. నటరాజన్ తీసుకుంటున్నారు. వీరు మంచి ప్రదర్శన ఇస్తున్నప్పటికీ, స్టార్క్ లాంటి అనుభవజ్ఞుడి లేకపోవడం జట్టుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, తన గైర్హాజరీపై స్టార్క్ స్పందిస్తూ గాయం కారణంగానే ఆలస్యం జరిగిందని తెలిపాడు. జట్టుకు దూరంగా ఉండటం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, త్వరలోనే తిరిగి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నానని పేర్కొన్నాడు.

## కాండిడేట్స్ టోర్నీలో భద్రతపై వివాదం..

- **నకమురా ఘాటు వ్యాఖ్యలు**


**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** అంతర్జాతీయ చెస్ సమాఖ్య నిర్వహిస్తున్న కాండిడేట్స్ టోర్నమెంట్ ప్రస్తుతం వివాదానికి కేంద్రంగా మారింది. టోర్నీలో అమలు చేస్తున్న కఠిన భద్రతా తనిఖీలపై అమెరికన్ చెస్ గ్రాండ్‌మాస్టర్ హికారు నకమురా అసంతృప్తి వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. చెస్‌లో టెక్నాలజీ ఆధారిత మోసాలను అరికట్టేందుకు ఈసారి ఫిడే కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఆటగాళ్లు హాల్‌లోకి ప్రవేశించే సమయంలో, బయటకు వచ్చే సమయంలో మెటల్ డిటెక్టర్లు, బాడీ స్కానర్లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నకమురా స్పందిస్తూ, "ప్రతి సారి ఇలాంటి స్కానింగ్‌లు అవసరమా? మనం ఏజెంట్లమా? మేము కేవలం చెస్ ఆటగాళ్లమే" అంటూ అసహనం వ్యక్తం చేశారు. నకమురా వ్యాఖ్యలపై భారత చెస్ వర్గాల్లో విభిన్న స్పందనలు వచ్చాయి. గ్రాండ్‌మాస్టర్ ప్రవీణ్ థిప్సే మాట్లాడుతూ, చెస్‌లో మోసం చాలా తీవ్రమైన సమస్య అని, చిన్న టెక్నాలజీ సహాయంతోనే ఫలితాలను ప్రభా



వితం చేసే అవకాశం ఉందని తెలిపారు. అందుకే భద్రతా తనిఖీలు అవసరమని అభిప్రాయపడ్డారు. అయితే మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని ఆలస్యం చేయడం వంటి ప్రత్యామ్నాయాల ద్వారా కూడా మోసాలను అరికట్టవచ్చని సూచించారు. ఇదిలా ఉండగా, ఫిడే అధికారులు కూడా ఈ అంశంపై స్పందించారు. భద్రతా చర్యలు కేవలం ఆటలో పారదర్శకతను కాపాడటానికేనని స్పష్టం చేశారు. నకమురా తప్ప ఇతర ప్రముఖ ఆటగాళ్లు ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని తెలిపారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు దారితీసే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

## బౌలర్లపై కాదు.. బ్యాటర్లదే తప్పు: క్లాసెన్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** ఐపీఎల్ 2026 సీజన్‌ను ఆశించిన విధంగా ప్రారంభించలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో లోపాలపై చర్చలు కొనసాగుతున్నాయి. మూడు మ్యాచ్‌లలో రెండు ఓటములు ఎదుర్కొన్న ఈ జట్టు ప్రదర్శనపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ విభాగం బలహీనంగా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలను జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఖండించాడు. జట్టు ఓటములకు బౌలర్లను బాధ్యులుగా చూడకూడదని, బ్యాటర్లు కూడా తమ బాధ్యతను సరిగా నిర్వర్తించలేదని స్పష్టం చేశాడు. తమ జట్టు గత మూడు మ్యాచ్‌లలో సుమారు 40 పరుగులు తక్కువగా చేసినట్లు క్లాసెన్ పేర్కొన్నాడు. ప్రతి మ్యాచ్‌లో 220–230 పరుగులు చేయాల్సిన అవసరం ఉందని, అదే జట్టు వ్యూహమని వెల్లడించాడు. కానీ ఆ లక్ష్యాన్ని చేరుకోలేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని అన్నాడు. ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడం, బ్రైడన్ కార్స్ గాయం కారణంగా దూరమవడం జట్టుకు నష్టమేనని క్లాసెన్ అంగీకరించాడు. అయినప్పటికీ, మిగతా బౌలింగ్ విభాగం అనుభవజ్ఞులదే అని చెప్పాడు. బౌలర్లపై విమర్శలు చేయడం సులభమే కానీ, ఓడిన మ్యాచ్‌ల్లో బ్యాటర్లు 20–30 పరుగులు తక్కువ చేశారనే విషయాన్ని గుర్తించాలన్నారు. తాము పెద్ద స్కోర్లు సాధిస్తే బౌలర్లకు మ్యాచ్‌ను కాపాడుకునే అవకాశం లభిస్తుందని క్లాసెన్ వివరించాడు. మొత్తానికి, సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల కోసం బ్యాటింగ్ విభాగం మెరుగుపడాల్సిన అవసరం ఉందని క్లాసెన్ స్పష్టం చేశాడు.



## రహానే నిర్ణయం అర్థం కాలేదు.. ఫించ్ విమర్శలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే తీసుకున్న నిర్ణయంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో జట్టు ప్రదర్శన ఇప్పటికే నిరాశపరిచేలా ఉండగా, పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడం మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఈడెన్ గార్డెన్స్‌లో పిచ్ ముందుగానే కవర్ల కింద ఉండటం, వర్షం వచ్చే అవకాశాలు ఉండటం తెలిసినా రహానే ఈ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని మాజీ ఆస్ట్రేలియా కెప్టెన్ ఆరోన్ ఫించ్ అభిప్రాయపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో ముందుగా బౌలింగ్ చేయడం ఉత్తమమని, బ్యాటింగ్ ఎంచుకోవడం అసలు అర్థం కాలేదని వ్యాఖ్యానించాడు. అందుబాటులో ఉన్న సమాచారం ఉన్నప్పటికీ తప్పు నిర్ణయం తీసుకోవడం నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతుందని ఫించ్ చెప్పాడు. ఇది ఓవర్ థింకింగ్



లేదా పరిస్థితులను పట్టించుకోకపోవడమేనని పేర్కొన్నాడు. ఇక విమర్శలకు స్పందిస్తూ రహానే చేసిన వ్యాఖ్యలపైనా ఫించ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. విమర్శలను వ్యక్తిగతంగా తీసుకోవద్దని, కెప్టెన్‌గా ప్రశాంతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించాడు. ప్రస్తుతం కేకేఆర్ జట్టు ఒకే పాయింట్‌తో కష్టాల్లో ఉండగా, ఈ పరిస్థితిని మార్చాలంటే జట్టు మరింత అగ్రెసివ్‌గా ఆడాల్సిన అవసరం ఉందని ఫించ్ సూచించాడు.



## నెట్స్‌లో అదరగొడుతున్న అర్జున్..

- **అవకాశం కోసం ఎదురుచూపులు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** ముంబయి ఇండియన్స్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు మారిన అర్జున్ టెండూల్కర్‌కు ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇంకా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేదు. మ్యాచ్‌లలో అవకాశాలు రాకపోయినా, తన ప్రతిభను నిరూపించుకోవడానికి అతను శ్రమిస్తున్నాడు. ప్రస్తుతం నెట్స్‌లో అర్జున్ బౌలింగ్ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా యార్కర్లను అచ్చుగుద్దినట్టు వేస్తూ బ్యాటర్లను ఇబ్బందిపెడుతున్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో కెప్టెన్ రిషభ్ పంత్‌ను కూడా అతను తన బౌలింగ్‌తో ఇబ్బందులకు గురిచేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అర్జున్ బౌలింగ్ ఖచ్చితత్వం చూసిన అభిమానులు, అతనికి ఇంకా అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. నెట్స్‌లో చూపిస్తున్న ప్రదర్శన చూస్తే మ్యాచ్‌ల్లో కూడా అతను రాణించే సామర్థ్యం ఉందని అభిప్రాయపడుతున్నారు. గతంలో గోవా తరపున దేశీయ క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా మంచి ప్రదర్శన చేసిన అర్జున్, ప్రస్తుతం కోచింగ్ సిబ్బంది, సీనియర్ ఆటగాళ్లతో కలిసి తన ఆటను మెరుగుపరుచుకుంటున్నాడు. అతని క్రమశిక్షణ, కృషిని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ కూడా ప్రశంసించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 9న కోల్‌కతాతో జరిగే మ్యాచ్‌లో అయినా అర్జున్‌కు అవకాశం లభిస్తుందేమో చూడాలి. అతనికి ఛాన్స్ వస్తే తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నాడని నెట్స్ ప్రదర్శన చెబుతోంది.



## క్రికెటర్ డేవిడ్ వార్నర్ అరెస్ట్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో అరెస్టయ్యాడు. ఈ ఘటన సిడ్నీలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ తనిఖీల సమయంలో పోలీసులు నిర్వహించిన బ్రీత్ అనలైజర్ పరీక్షలో వార్నర్ చట్టపరమైన పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలింది. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వార్నర్‌ను బెయిల్‌పై విడుదల చేసినట్లు సమాచారం. ఈ కేసులో వచ్చే నెల కోర్టు ఎదుట హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం వార్నర్ పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో కరాచీ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ ఘటన అతడి క్రికెట్ కెరీర్‌పై ప్రభావం చూపుతుందా అన్నది చూడాలి.



## హైదరాబాద్ బిర్యానీ ఘాటు.. క్లాసెన్ కళ్లలో నీళ్లు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** హైదరాబాద్ బిర్యానీ పేరు వినగానే నోరూరేంతగా ప్రపంచవ్యాప్తంగా దానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి బిర్యానీని తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు రుచి చూశారు. ఈ సందర్భంగా జరిగిన ఒక సరదా ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జట్టు ఆటగాడు క్లాసెన్ బిర్యానీ తింటుండగా మసాలా ఘాటు ఎక్కువగా తగలడంతో ఒక్కసారిగా కళ్లలో నీళ్లు వచ్చాయి. వెంటనే కర్చీఫ్‌తో తుడుచుకుంటూ కనిపించాడు. ఈ దృశ్యం చూసిన జట్టు సభ్యులు నవ్వులు ఆపుకోలేకపోయారు. కెప్టెన్ ఇషాన్ కిషన్ సహా ఇతర ఆటగాళ్లు కూడా క్లాసెన్‌ను సరదాగా ఆటపట్టించారు. హైదరాబాద్ బిర్యానీ ఘాటు ఇలానే ఉంటుందని చెప్పుకుంటూ నవ్వుకున్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన క్లాసెన్‌కు ఇలాంటి మసాలా ఆహారం పెద్దగా అలవాటు లేకపోవడంతోనే ఇలా జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతోంది.

## షారుఖ్ ఖాన్, కేకేఆర్ సీఈఓతో తీవ్ర చర్చలు



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :** పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా కేకేఆర్ క్యాంప్‌లో ఆసక్తికర దృశ్యం కనిపించింది. జట్టు సహ యజమాని షారుఖ్ ఖాన్, సీఈఓ వెంకీ మైసూర్‌తో గంభీరంగా చర్చిస్తున్నట్లు కెమెరాల్లో కనిపించారు. మ్యాచ్ ఆరంభంలోనే కేకేఆర్ రెండు కీలక వికెట్లు కోల్పోవడంతో జట్టు ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో వర్షం కారణంగా ఆట నిలిచిపోవడంతో, విరామ సమయంలో ఈ చర్చ చోటుచేసుకుంది. షారుఖ్ ఖాన్ ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపించగా, జట్టు పరిస్థితిపై ఇద్దరూ సీరియస్‌గా మాట్లాడుకున్నట్లు అనిపించింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో చర్చకు దారితీశాయి. అయితే ఇది వాగ్వాదమా లేక సాధారణ చర్చనా అన్నది స్పష్టంగా తెలియకపోయినా, జట్టు పరిస్థితి నేపథ్యంలో ఈ సంఘటన ప్రాధాన్యం సంతరించుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





# వారణాసి.. మొదటిరోజే 300 కోట్లు

ముద్ర సినిమా డెస్క్ :

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం వారణాసి విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. సూపర్ స్టార్ మహేష్ బాబు లీడ్ రోల్ లో దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఆ విషయాన్ని చిత్ర బృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. విడుదలకు సరిగ్గా ఏడాది సమయం ఉండటంతో.. చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక పోస్ట్ షేర్ చేసింది. ఇంకో ఏడాది తర్వాత ఇదే రోజు వారణాసి షో టైం అంటూ ప్రకటిస్తూ, సినిమా విడుదలలో ఎటువంటి ఆలస్యం ఉండదని క్లారిటీ ఇచ్చింది. దీంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ హైదరాబాద్ లో వేగంగా కొనసాగుతోంది. తాజాగా మూవీ నుంచి పోస్ట్ పెట్టారు. "ప్రపంచం ఇంకా సిద్ధంగా లేని ఒక సంచలనం.. కేవలం ఒకే ఒక్క సంవత్సరంలో' ప్రపంచ సినిమా రంగంపై తన ఆధిపత్యాన్ని చాటబోతోంది. వారణాసి మూవీ.. ఏప్రిల్ 7, 2027 నుంచి రుద్ర ఆగమనం.. మరో ఒక్క సంవత్సరంలో" అంటూ రాసుకొచ్చారు. అయితే సినిమాను



శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై నిర్మాత కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. దాదాపు రూ.1200 కోట్లకు పైగా వ్యయంతో రూపొందిస్తున్నారు. ఇప్పటికే బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి చిత్రాలతో భారతీయ సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన రాజమౌళి.. వారణాసితో మరింత పెద్ద రికార్డులు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విడుదల రోజునే రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి.. ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా రికార్డు క్రియేట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట.



# అభిమానులను టెన్షన్ పెడుతున్న 'పెద్ది'

ముద్ర, సినిమా డెస్క్ :

'పెద్ది' సినిమా రిలీజ్‌పై ఇంకా క్లారిటీ లేకపోవడం అభిమానులను టెన్షన్‌కు గురిచేస్తోంది. ఏప్రిల్ 30న సినిమా రాదన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ, నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన లేకపోవడం గందరగోళాన్ని పెంచుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూన్ 4 లేదా జూన్ 25కు వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఆ తేదీల్లో ఇతర పెద్ద సినిమాలు ఉండటంతో, ఫైనల్ డేట్‌పై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. ఇక దర్శకుడు బుచ్చి బాబు షూటింగ్ పనుల్లో బిజీగా ఉండగా, ఐటెం సాంగ్‌కు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు. ఇదిలా ఉండగా, ఐపీఎల్ ప్రభావం, ఎండలు వంటి కారణాల వల్ల జూన్ రిలీజ్ ప్లాన్ చేయడం సేఫ్‌గా భావిస్తున్నారు.మొత్తానికి, 'పెద్ది' విడుదల తేదీపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

# ఆలియా గ్లామర్‌కు క్లాసిక్ టచ్

ముద్ర, సినిమా డెస్క్ :

తాజా ఫోటోషూట్‌తో ఆలియా భట్ మరోసారి అందరి దృష్టిని తనవైపు మళ్లించింది. గ్లామర్‌తో పాటు ఎలిగెన్స్‌ను సమతుల్యం చేసే ఆమె స్టైల్ ఎప్పటి లాగే ఆకట్టుకుంటోంది. ఈసారి తెల్లని చీరలో ఆలియా ఎంతో నాజూకుగా, ఆకర్షణీయంగా కనిపించింది. చీర అంచులపై ఉన్న సున్నితమైన ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ ఆమె లుక్‌కు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చింది. దీనికి జత చేసిన హెవీ ఎంబెలిష్డ్ కార్సెట్ బ్లౌజ్ మొత్తం అవుట్‌ఫిట్‌ను మరింత స్టైలిష్‌గా, రిచ్‌గా మార్చింది. బ్లాక్ అండ్ వైట్ థీమ్‌లో తీసిన ఈ ఫోటోషూట్‌లో ఆలియా క్లాసిక్ స్టైల్‌తో పాటు ఆధునిక ఫ్యాషన్‌ను చక్కగా మేళవించింది. సాధారణంగా కనిపించినా, ప్రతి ఫ్రేమ్‌లో ఆమె ప్రత్యేక ఆకర్షణ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ లుక్‌తో మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌ను ఆలియా నిరూపించింది.

# అట్లీ బన్నీ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్

**టైటిల్ గ్లింప్స్ కి ముహూర్తం ఫిక్స్!**

ముద్ర సినిమా డెస్క్:

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ ఇప్పుడు దేశ సరిహద్దులు దాటేసింది. 'పుష్ప' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన బన్నీ, ఇప్పుడు తన పుట్టినరోజు (ఏప్రిల్ 8) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇవ్వనున్నారు. కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీతో బన్నీ చేయబోయే సినిమాపై సోషల్ మీడియాలో భారీ ఎత్తున హైప్ నడుస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ నుంచి ఒక స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయడంతో సోషల్ మీడియా మొత్తం బన్నీ నామస్మరణతో మారుమోగిపోతోంది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా టైటిల్ మరియు గ్లింప్స్ అనౌన్స్‌మెంట్‌కు ముహూర్తం ఖరారైంది. ఇక ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ సినిమా పేరును అధికారికంగా ప్రకటించబోతున్నారు





# రావణుడిని గొప్పగా చూపించబోతున్నారా?

**ముద్ర, సినిమా డెస్క్ :**

'రామాయణ' ఆధారంగా వస్తున్న తాజా చిత్రంలో రావణుడి పాత్రను కొత్త కోణంలో చూపించబోతున్నారన్న వార్తలు ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే అదే సమయంలో "రావణుడిని నిజంగా అంత గొప్పగా చూపించగలరా?" అన్న సందేహం కూడా సినీ అభిమానుల్లో వ్యక్తమవుతోంది. పారంపర్యంగా రావణుడు ప్రతినాయకుడిగా ప్రసిద్ధి పొందినా, ఇతిహాసాల్లో అతనికి ఉన్న పలు గొప్ప లక్షణాలు కూడా చెప్పబడతాయి. శివభక్తుడిగా, సంగీతంలో పాండిత్యం కలిగినవాడిగా, పరిపాలనలో నైపుణ్యం ఉన్న రాజుగా అతని వ్యక్తిత్వానికి మరొక వైపు ఉంది. ఈ అంశాలను సమతుల్యం చేస్తూ చూపించడం దర్శకుడికి పెద్ద సవాల్‌గా మారుతుంది. గతంలో ఎన్టీఆర్, ఎస్వీ రంగారావు వంటి మహానటులు రావణుడి పాత్రకు అద్భుతమైన గౌరవాన్ని తీసుకువచ్చారు. వారి నటనలో ప్రతినాయకత్వం మాత్రమే కాకుండా, పాత్రలోని గంభీరత, గౌరవం కూడా స్పష్టంగా కనిపించేవి. అందుకే వారి ప్రదర్శనలు ఇప్పటికీ క్లాసిక్‌గా నిలిచాయి. ఇప్పుడు యష్ ఈ పాత్రలో కనిపించబోతుండటంతో సహజంగానే పోలికలు రావడం ఖాయం.



అతను ఈ పాత్రలో లోతైన భావోద్వేగాలను, శక్తివంతమైన వ్యక్తిత్వాన్ని సమర్థంగా చూపించగలిగితే, రావణుడి పాత్రకు మరో కొత్త గుర్తింపు తీసుకురాగలడు. మొత్తానికి, రావణుడిని గొప్పగా చూపించడం అసాధ్యం కాదు. కానీ అది ఎలా చూపిస్తారు, ఎంత సమతుల్యంగా ప్రదర్శిస్తారు అన్నదే కీలకం. ప్రేక్షకులు అంగీకరించేలా, అదే సమయంలో ఇతిహాసానికి న్యాయం చేసేలా చూపించగలిగితేనే ఈ ప్రయత్నం విజయవంతమవుతుంది.



# స్ట్రాప్‌లెస్ లుక్‌తో కృతి మెస్మరైజ్

ముద్ర, సినిమా డెస్క్ :

కృతి శెట్టి మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఆమె షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. స్టైలిష్ లుక్స్‌తో ఎప్పుడూ ప్రత్యేకంగా కనిపించే కృతి, ఈసారి కూడా తన అందంతో మెప్పించింది. తాజా ఫోటోషూట్‌లో కృతి మెరిసే పింక్ స్ట్రాప్‌లెస్ సీక్విన్ గౌన్‌లో కనిపించింది. ఈ డ్రెస్ ఆమె శరీరాకృతికి సరిగ్గా సరిపోతూ గ్లామర్‌ను మరింత హైలైట్ చేసింది. బ్యాక్‌లెస్ డిజైన్‌తో పాటు స్లీక్ స్టైల్ ఆమె లుక్‌కు ఎలిగెంట్ టచ్ ఇచ్చింది. పొడవాటి జుట్టును సహజంగా వదిలి, స్టేట్‌మెంట్ ఇయర్‌రింగ్స్‌తో కృతి తన స్టైలింగ్‌ను పూర్తి చేసింది. మినిమల్ మేకప్‌తో ఆమె అందం మరింత మెరిపించింది. మొత్తం లుక్ మోడ్రన్‌గా, క్లాసీగా



# బ్లాక్ అండ్ వైట్‌లో హెబ్బా బోల్డ్ లుక్

ముద్ర, సినిమా డెస్క్ :

హెబ్బా పటేల్ తాజాగా విడుదల చేసిన ఫోటోషూట్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈసారి ఆమె బ్లాక్ అండ్ వైట్ థీమ్‌లో కనిపిస్తూ ప్రత్యేకమైన స్టైల్‌ను ప్రదర్శించింది. సాధారణ గ్లామర్ ఫోటోలతో పోలిస్తే, ఈ షూట్‌లో ఆమె మరింత బోల్డ్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపించింది. బ్లాక్ లేస్ బాడీహగ్గింగ్ ఔట్‌ఫిట్‌లో హెబ్బా తన అందాన్ని స్టైలిష్‌గా ప్రదర్శించింది. డీప్ నెక్ డిజైన్, సాఫ్ట్ లేస్ డిటైలింగ్ ఆమె లుక్‌కు ఆకర్షణను తీసుకువచ్చాయి. ఫిట్‌గా ఉన్న ఈ డ్రెస్ ఆమె ఫిగర్‌ను హైలైట్ చేస్తూ, ఎలిగెంట్ గ్లామర్‌ను అందించింది. మోనోక్రోమ్ టోన్ ఫోటోలకు ప్రత్యేకమైన క్లాసీ టచ్ ఇచ్చింది. లైటింగ్, యాంగిల్స్ కలిసి ఆమె లుక్స్‌ను మరింత షార్ప్‌గా చూపించాయి. మినిమల్ స్టైలింగ్ వల్ల ఫోకస్ మొత్తం ఆమె ఎక్స్‌ప్రెషన్స్‌పైనే పడింది.ఈ ఫోటోషూట్ ద్వారా హెబ్బా తనలోని కొత్త కోణాన్ని చూపించింది. బోల్డ్ లుక్స్‌లో కూడా క్లాస్ మెయింటైన్ చేస్తూ, ట్రెండీ స్టైల్‌తో అభిమానులను మెస్మరైజ్ చేసింది.



# బీచ్ ఒడ్డున అందాల అరాచకం

దేవయానీ శర్మ ఈ అందమైన బీచ్ సన్నివేశంలో ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, సహజ సౌందర్యాన్ని అద్భుతంగా ప్రతిబింబించారు. రంగురంగుల స్ట్రైప్డ్ స్విమ్‌సూట్‌లో సముద్ర తీరంలోని రాళ్లపై పాదరక్షలు లేకుండా నిలబడి, ఆమె శక్తి మరియు ప్రశాంతతను సమన్వయంగా చూపించారు. ఆమె పంచుకున్న కవితాత్మకమైన క్యాప్షన్‌లో ప్రకృతితో ఉన్న ఆత్మీయ బంధం, మనసుకు నయం కలిగించే భావం, స్వేచ్ఛ మరియు స్వీయ అన్వేషణ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ దృశ్యం కేవలం అందంగా కాకుండా, లోతైన భావోద్వేగాన్ని కూడా మనకు అందిస్తుంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com